
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

3

ఆదివారం 16 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 21.5

వ్యవసాయరంగంలో సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు ప్రభుత్వం పూనుకుంది. పంటల సాగులో వస్తున్న మార్పులతో పాటు శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎప్పటికప్పుడు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతులు సేంద్రీయ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాల వినియోగంతోపాటు పంటల దిగుబడి పై తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించనుంది. సాగులో సాంకేతిక అంశాలపై నిరంతరం రైతులకు అవగాహన కల్పించనుంది. రైతులకు ప్రస్తుతం అందుతున్న సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



రైతు వేదికల ద్వారా

మరిన్ని సేవలు

- 'రైతు నేస్తం' కేంద్రాల పెంపునకు సన్నాహాలు
- అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు చర్యలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 315 రైతు వేదికల్లో 77 'రైతు నేస్తం' కేంద్రాలు
- మండలానికి మరో రెండు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రతినెలా నిధుల మంజూరు యోచన
- స్థలం ఉంటే గోదాముల నిర్మాణం

రైతులకు ఆధునిక సాంకేతికను అందించడం, దిగుబడుల సాధన, సమస్యలపై చర్చించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఉమ్మడి జిల్లాల్లో క్లస్టర్ల వారీగా వీటిని నిర్మించారు. రైతు వేదికల ద్వారా రైతులకు పంటల సాగు, దిగుబడితోపాటు పంటల మార్పిడి వంటి తగిన సూచనలు ఈవేదికల ద్వారా వ్యవసాయాధికారులు అందిస్తున్నారు. అయితే రైతు వేదికలను బలోపేతం చేసి, వీటి ద్వారా రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలందించనుంది. వీటి నిర్వహణకు ప్రతీ నెల నిధులు విడుదల చేసేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా ఉన్న రైతు వేదికలపై సమగ్ర సమాచారాన్ని వ్యవసాయశాఖను కోరింది. జిల్లాలో ఎన్ని రైతు వేదికలు ఉన్నాయి? వీటిలో రైతులకు సేవలందించేందుకు ఉన్న పరికరాలు (టీవీ,ప్రొజెక్టర్, ఇంటర్నెట్) ఏంటి? మౌలిక వసతు లుఉన్నాయా? రైతులకు అందుబాటులో ఉన్నా యా?అనే పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది.

315 రైతువేదికలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 315 వరకు రైతువేదికలు ఉన్నాయి. వీటిలో యాదాద్రి జిల్లాలో మొత్తం 17 మండలాల్లో 92 రైతు వేదికలు, నల్లగొండ జిల్లాలో 140, సూర్యాపేట జిల్లాలో 83 వరకు రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ వేదికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి నిధులు మంజూరు కావడంలేదు. వ్యవసాయశాఖ అధికారులే సొంతంగా ఖర్చులు భరిస్తున్నారు. అయితే రైతులకు ఉపయోగపడేలా మరిన్ని సేవలందించేందుకు వీటిని తీర్చిదిద్దేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం కార్యరూపం దాల్చితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

మరిన్ని రైతు నేస్తం కేంద్రాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరిన్ని రేతు నేస్తం కేంద్రాలను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం 315 రైతువేదికల్లో 77చోట్ల రైతు నేస్తం సేవలు అందుతున్నాయి. వీటిలో రైతులు నేరుగా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే అవకాశం..

- మిగతా 5వ పేజీలో...

మరిన్ని వేదికల ద్వారా సేవలు



రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 'రైతు నేస్తం' కేంద్రాలను విస్తరించనున్నాం. వీటిని బలోపేతం చేసి, రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. జిల్లాలోని రైతు వేదికలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం ఎంపిక చేసిన కేంద్రాలకు సాంకేతిక పరికరాలు మంజూరు కానున్నాయి. మండలానికి రెండుమూడు చొప్పున 'రైతు నేస్తం' కేంద్రాలు ఏర్పాటుకానుండటంతో, రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

- గోపాల్, యాదాద్రి జిల్లా వ్యవసాయాధికారి

గోదాముల నిర్మాణం సైతం

రైతువేదికలు ప్రస్తుతం సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడుతున్నాయి. ఒక్కోచోట 10 గుంటల నుంచి మొదలు ఎకరానికి పైగా ఉన్న స్థలాల్లో వీటిని నిర్మించారు. అయితే సమావేశాలతో పాటు అవసరాన్ని బట్టి గోదాములు, విత్తనాలు, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వీటిని వినియోగించుకుంటున్నారు. ఈ వేదికలు నిర్మించిన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే గోదాములు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. వానాకాలం, యాసంగిలో రైతులు పండించిన పలు పంటల దిగుబడిని భద్రపరిచేందుకు సరైన గోదాములు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థలం ఉంటే ఆయా ప్రాంతాల్లో గోదాములు నిర్మించనున్నారు.



ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో

నిర్లక్ష్యం

- ఆరో రోజు కవర్‌లో ఏడో రోజు ప్రశ్నపత్రాలు
- బెంబేలెత్తిన పరీక్షల నిర్వహణ అధికారులు
- ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడే ఉండడంతో తక్షణం దిద్దుబాటు చర్యలు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నల్లగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో అధికారుల నిర్లక్ష్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. ఎంతో జాగ్రత్తగా, ఏ రోజు పరీక్షలకు సం బంధించిన ప్రశ్నపత్రాలను ఆ రోజు మాత్రమే, మూడేసి సెట్ల మేర ప్యాక్ చేయాలి. అయితే మరో రోజుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సైతం ముందు రోజు ప్యాకెట్‌లో కలిపేసిన అం శం పరీక్షల నిర్వహణ అధికారులను, కేంద్రాల నిర్వాహకులను బెంబేలెత్తించింది. ప్రశ్నపత్రాల కవర్ సీల్ తెరిచాక అదనపు మరుసటి రోజు ప్రశ్నపత్రాలు అదనంగా ఉండటంతో సదరు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి హడావుడిగా వాటిని మళ్లీ కవర్లో భద్రపరచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఓఇంటర్ పరీక్షా కేంద్రంలో జరిగిన ఈ తతంగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆరో రోజు కవర్లో ఏడోరోజు ఒకేషనల్ పేపర్లు.

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఓ పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల ప్యాకేజీలో లొసుగులు బయటపడ్డాయి. అన్ని పరీక్షా కేంద్రాలకు పంపినట్లే ఇక్కడ పరీక్షలు రాసే విద్యార్థులకు అనుగుణంగా అవసరమైన ప్రశ్నపత్రాల కవర్లను ఇంటర్‌బోర్డు, డీఐఈవో నుంచి పోలీస్ బందోబస్తు నడుమ పరీక్షల ప్రారంభానికి ముందే కేంద్రానికి వచ్చాయి. అక్కడ వచ్చిన పేపర్లను, సెట్లను సరిచూసుకున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి వాటిని ఇంటర్‌బోర్డు సూచనలకు అనుగుణంగా పరీక్షల తేదీలు, పేపర్ల వారీగా కవర్లలో ప్యాక్ చేసి, సీల్‌వేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఎంతో పకడ్బందీగా, ఒకటికి రెండు పర్యాయాలు చెక్‌చేసుకొని మరీ ఈ కవర్ ప్యాక్ చేయాల్సి ఉంటుంది. ఏ రోజు పరీక్ష ఉంటే, ఆ రోజుకు సంబంధించిన కవర్లను పోలీస్ బందోబస్తుతో పరీక్షా కేంద్రానికి తీసుకు వచ్చి అక్కడ సీసీ కెమెరా సమక్షంలోనే ఓపెన్ చేసి విద్యార్థులకు పంపిణీ చేస్తారు. అయితే ఈ కేంద్రంలో ఆరో రోజున అంటే 12వ..

- మిగతా 5వ పేజీలో...

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (ఆదివారం సాయంత్రం)

సహర్: 5:01 (సోమవారం ఉదయం)

ప్రత్యేక పాలనపై

'పెదవి విరుపే'..!

- చుట్టపు చూపుగా వస్తున్న ప్రత్యేకాధికారులు
- ప(మ)ని భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే



గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ప్రత్యేకత ఏమీ కన్పించడం లేదు. సొంత డ్యూటీ పని ఒత్తిళ్లతో పంచాయతీలకు ప్రత్యేకాధికారులు చుట్టపు చూపుగా వస్తున్నారే తప్ప పూర్తిస్థాయి పాలనపై దృష్టిపెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ప్రత్యేక పాలన పంచాయతీ కార్యదర్శులకైతే 'ఎంకి పెళ్లి సుబ్బి చావు' కొచ్చిన చందంగా మారింది. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం పూర్తవడంతో గత 13 నెలలుగా సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. పేరుకే ప్రత్యేకాధికారులు ఉన్నారు కానీ భారమంతా పంచాయతీ కార్యదర్శులదేనన్న అభిప్రాయం వినపడుతోంది. ప్రజలకు అవసరమైన తాగు నీటి బోర్ల ఏర్పాటు, మోటార్ల మరమ్మతు, పైపులైన్ల లీకేజీ రిపేర్లు, విద్యుత్ వీధిదీపాలు, మురుగు కాల్వ నిర్వహణ పనులలో పురోగతి లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు.

•5లో..

బకాయిలు చెల్లించకుంటే

పరీక్షలు కొనసాగించలేం



వీసీకి వినతిపత్రం ఇస్తున్న కళాశాలల యజమానులు

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాల యాజమాన్యాలకు నాలుగేళ్లుగా చెల్లించాల్సిన ఆర్‌టీఎఫ్ బకాయిలు ఇవ్వకుంటే 1, 4, 6వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించేది లేదని డిగ్రీ అండ్ పీజీ కళాశాల యాజమాన్య సంఘాలు స్పష్టం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం ఏళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించడంలేదన్నారు. పేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ తాము అప్పులు చేసి కళాశాలలు నడుపుతూ ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. యాజమాన్యాలకు నాలుగేళ్లుగా ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ ఫీజులు చెల్లించకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. భవనాల అద్దె, ఉద్యోగాల వేతనాల ఒత్తిడి, వారి సహాయనిరాకరణ, రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు టి.శ్రీనివాసరెడ్డి, సిహెచ్.సత్యంగౌడ్, డాక్టర్ పి.నర్సింహారెడ్డి, యం.సైదారావు, కె.జైపాల్‌రెడ్డి, జానయ్యయాదవ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖకు సంపూర్ణ సహకారం

- గంజాయి నిర్మూలనలో కఠినంగా వ్యవహరించాలి
- మత సామరస్యంలో జిల్లా రోల్‌మోడల్‌గా నిలవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుతం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖ అంటేనే క్రమశిక్షణతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌కు మారుపేరన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రీడలు ఎంతో దోహదపడతాయని, క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలను పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఎంతో మంది యువత, విద్యార్థులు వారి బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారిని సక్రమ మార్గంలో పెట్టి జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ జాతీయ స్థాయిలో క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించే పోలీస్ క్రీడాకారులకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా వృద్ధులకు సైతం కలెక్టర్ గ్రీవెన్స్‌డే నిర్వహించి వారి ఇబ్బందులు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపద సమయంలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం అండగా ఉంటున్నామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయంలోని డార్మెటరీ హాల్ మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. తన నిధులు, ప్రభుత్వ సహకారంతో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డీఎస్పీ కార్యాలయం, ఇతర నూతన భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి పోలీస్‌శాఖకు ఏం కావాలన్నా తన వంతుగా కృషి చేస్తానన్నారు. అదే విధంగా నల్లగొండ జిల్లా అంటేనే మత సామరస్యానికి ప్రతీక అని, రానున్న రంజాన్, ఇతర పండుగల నేపథ్యంలో అంతా సోదరభావంతో మెలిగాలన్నారు. కలిసి మెలిసి పండగలను శాంతియుతగా నిర్వహించుకోవాలని సూచించారు.25 ఏళ్లగా జిల్లా కేంద్రంలో ఎలాంటి మత ఘర్షణలు లేకుండా సోదరభావంతో మెలిగామని, రానున్న రోజుల్లో కూడా ఇలాగే ఉంటూ జిల్లా రోల్‌మోడల్‌గా నిలవాలన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యూనిఫామ్ సర్వీస్ కాబట్టి స్పోర్ట్స్ చాలా అవసరమన్నారు. మూడు రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉంటూ ఒత్తిడితో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇలాంటి స్పోర్ట్స్ మీట్ ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. ఈ ఆలోచనతో హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్ల తర్వాత స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు స్టేట్ పోలీస్ మీట్‌లో బంగారు పతకాలు సైతం సాధించారని, ఉమెన్స్ విభాగంలో సెకండ్ ప్లేస్‌లో నిలవడం సంతోషకరమన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్‌వార్ క్రీడాంశాల్లో ఏఆర్ నల్లగొండ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, నల్లగొండ సబ్ డివిజన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, రమేష్, ఆర్ఐలు శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఈవీఎం గోదాం వద్ద అఖిలపక్ష నాయకులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మా ర్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతిష్టాత్మకంగా నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు పంపిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని కలెక్టర్ శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులకు, గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహ నిర్మాణశా ఖ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంల వద్ద నిరంతరం భద్రత ఉండాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాం వద్ద నిరంతర భద్రత కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రతీ నెల ఈవీఎం గోదాం తనిఖీలో భాగంగా శనివారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును ఆమె తనిఖీ చేశారు. వారి సమక్షంలో గోదాం సీల్ తీయించి భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఫొటో ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయపార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 1,812 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్ చొప్పున నియమించాలన్నారు. దీంతో ఓటరు జాబితా తయారీలో ఎలాంటి తప్పులు దొర్లవన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫాం-6, 7, 8లను ఈనెల 21 లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పలు రాజకీయపార్టీల ప్రతినిధులు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థుల సామర్థ్యం పెంపు: డీఈవో



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో

హాలియా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఏఎక్స్‌ఎల్ టెక్నాలజీ విద్యార్థుల సామర్థ్యం పెంపునకు దోహదపడుతుందని డీఈవో భిక్షపతి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీతో కూడిన కృత్రిమ మేధను ఉపయోగిస్తూ ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందు లో భాగంగా ఈనెల 12న సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. 3, 4, 5 తరగతుల్లోని సీ-గ్రేడ్ పిల్లలను గుర్తించి ప్రతీ విద్యార్థికి పీరియడ్‌కు 20 నిమిషాల చొప్పున భాషాంశాల్లో రెండు పిరియడ్లు, గణితంలో రెండు పీరియడ్లు కేటాయిస్తూ టైంటేబుల్ రూపొందించి తరగతులు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సహకరిస్తూ సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం పొందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, రవీందర్, జె.నిర్మల, సరిత, తదితరులు పాల్గొన్నారు.



క్షణాల్లో ప్రాణం నిలబెట్టాడు



భువనగిరిలో కృష్ణా ఎక్స్‌ప్రెస్ వద్ద ప్రయాణికుడిని కాపాడిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది

భువనగిరి టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అప్రమత్తత ఓ ప్రయాణికుడి ప్రాణాలను కాపాడింది. క్షణాల వ్యవధిలో జరిగిన ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి రైల్వే స్టేషన్‌లో నాలుగు రోజుల క్రితం జరిగింది. సంబంధిత వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో శనివారం విషయం వెలుగుచూసింది. ఆర్‌పీఎఫ్ వర్గాలు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన జాజిరెడ్డి జగదీష్ తన మిత్రుడు పీ.శ్రీనివాస్‌తో కలిసి నల్లగొండలో ఉంటున్న తన కుమార్తె అశ్విని వద్దకు ఈ నెల 11వ తేదీన వెళ్లాడు. నిజామాబాద్‌కు వెళ్లేందుకు ఈ ముగ్గురు కలిసి 12వ తేదీన భువనగిరి రైల్వేస్టేషన్‌కు చేరుకుని, రాత్రి 8.23 గంటలకు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. రైలు ప్రారంభమైన వెంటనే ప్రమాదవశాత్తు జగదీష్ జారిపడి నడుస్తున్న రైలు- ప్లాట్ ఫాం మధ్య ఇరుక్కున్నాడు. అదే సమయంలో భువనగిరి రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఖాజీపేటకు చెందిన ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.బాలాజీ అప్రమత్తమై జగదీష్‌ను చాకచక్యంగా ప్లాట్‌ఫాంపైకి లాగటంతో స్వల్పగాయాలతో ప్రాణాలు దక్కించుకున్నాడు. అనంతరం రైల్వే పోలీసులు రైలును ఆపి జగదీష్ కుమార్తె అశ్వినిని, స్నేహితుడు శ్రీనివాసును దించి, జగదీష్‌కు ప్రాథమిక చికిత్సలు అందించి అప్పగించారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించి, ప్రయాణికుడి ప్రాణాలను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ బాలాజీని రైల్వే, ఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు, ప్రయాణికులు ప్రశంసించారు.

ఆలయంలో హుండీ చోరీ

భువనగిరిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి శివారు హుస్నేనాబాద్‌లోని మార్కండేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం పూజారి ఆలయానికి వెళ్లగా ఆలయ దర్వాజా విర గొట్టి హుండీని ధ్వంసం చేసి కానుకలను చోరీ చేసినట్టు గుర్తించాడు. అయితే శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బింగి భిక్షపతి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీసే టెక్‌ఫెస్ట్

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటుచేసిన నూతన ప్రాజెక్టు రూపకల్పన కార్యక్రమం(టెక్ ఫెస్ట్) సత్ఫలితాల దిశగా సాగుతోంది. అభ్యాసన దశలోనే సమాజ అభివృద్ధికి దోహదం చేసే ప్రయోగాలపై ఆసక్తి కలిగించేందుకు టెక్‌ఫెస్ట్‌లు మార్గనిర్దేశనంగా నిలుస్తున్నాయి. ఈ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల ప్రతిభా, సామర్థ్యాలను రెట్టింపు చేయడమే కాకుండా ఏకకాలంలో ఉన్నత గుర్తింపు పొందేందుకు దోహదపడుతోంది. దీంతో ప్రభుత్వం కళాశాల స్థాయిలోనే సరికొత్త ప్రయోగాత్మక ప్రదర్శన పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇటీవల యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సృజన టెక్‌ఫెస్ట్ విద్యార్థుల విభిన్న ఆలోచనలకు దర్పణంగా నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

విద్యార్థుల్లో అంతర్గతశక్తి వెలుగులోకి..



నాగార్జునసాగర్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ఆటో వోల్ట్ క్రూయిజ్

పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేస్తున్న టెక్ ఫెస్ట్‌ల్లో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొంటున్నారు. అధ్యాపకుల ప్రోత్సాహంతో రూపొందించిన యంత్రాలు(ఎగ్జిబిట్స్) ఆకట్టుకోవడంతో పాటు చూపరులను ఆలోచింపజేశాయి. గుట్ట పాలిటెక్నిక్ కళాశాల సృజన టెక్‌ఫెస్ట్ స్టాల్స్‌లో ఉంచిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఎగ్జిబిట్స్ వైవిధ్యంతో విజ్ఞాన వీచికలుగా నిలిచాయి. ఈ యంత్రాలు విద్యార్థుల సృజనాత్మకతకు అద్దంపట్టాయి.

టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శనలు చాలా సృజనాత్మకంగా ఉన్నాయి. విద్యార్థి దశలోనే కొత్త ఆవిష్కరణలకు వేదికగా ఫెస్ట్ నిలిచింది.

ప్రాజెక్టులు తయారుచేయడం సంతోషంగా ఉంది

ప్రభుత్వం ప్రతి ఏడాది విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను నిరూపించుకునేందుకు నిర్వహిస్తున్న టెక్‌ఫెస్ట్ ద్వారా ప్రాజెక్టులు తయారుచేయడం సంతోషంగా ఉంది. తమలో ఉన్న శక్తియుక్తులు ఏమిటో తెలియజేయడానికి ప్రాజెక్టుల ద్వారా నిరూపణ అవుతుంది. కొత్త ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడటం తృప్తిగా ఉంది.

\- స్థానిక కళాశాల విద్యార్థులు



వాయిస్ వీల్‌చైర్ ప్రాజెక్టు తయారుచేసిన గుట్ట కళాశాల విద్యార్థులు

విద్యార్థుల ప్రాజెక్టులు సమాజానికి తోడ్పడేలా ఉన్నాయి



ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, నాగార్జునసాగర్, యాదగిరిగుట్టకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు టెస్‌ఫెస్ట్ ద్వారా ప్రదర్శించిన ప్రాజెక్టులు నేటి సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయి. వాయిస్ వీల్‌చైర్, ఆటోమేటిక్ రీచార్జబుల్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆటో వోల్ట్ క్రూయిజ్ చాలా వరకు వాటి అవసరం ఎంతైనా ఉంటుంది. విద్యార్థి దశలోనూ తమ మేధాశక్తికి పదును పెట్టి ప్రాజెక్టులు ప్రదర్శించడం అభినందనీయం.

\- వెంకటేశ్వర్లు, డీఈ, ట్రాన్స్‌కో

విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతోంది




విద్యార్థులకు టెస్‌ఫెస్ట్ ద్వారా ప్రాజెక్టులు నిర్వహించడంతో వారిలో పోటీతత్వం పెరుగుతోంది. సృజనాత్మకతతో తయారుచేసిన ప్రాజెక్టులతో వారికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. ఒక్కొక్కరు తయారుచేసిన ప్రాజెక్టులు జిల్లా స్థాయి నుంచి ఎంపికై రాష్ట్రస్థాయి, అక్కడి నుంచి జాతీయ స్థాయి ప్రదర్శనకు వెళ్తాయి. దీంతో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

\- రాజగోపాల్‌రెడ్డి, కళాశాల హెచ్‌వోడీ

ఆకట్టుకున్న ప్రదర్శనలు

- ఈ టెక్‌ఫెస్ట్‌లో నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తయారుచేసిన ఆటోమేటిక్ రీచార్జబుల్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ ఉత్తమ ప్రదర్శనగా నిలిచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది.
- యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎలక్ట్రిక్ విభాగానికి చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనల్లో వాయిస్ కంట్రోల్డ్ వీల్ చైర్ ఎంతో ఆకట్టుకుంది.
- నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ఆటో వోల్ట్ క్రూయిజ్ సైతం సందర్శకులను ఆకట్టుకుంది.

టెక్‌ఫెస్ట్ ఎంతో ఉపయోగకరం



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెకిలితీయడానికి టెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం. వారు ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించడంతో అవి సమాజానికి తోడ్పడే విధంగా ఉండే అవకాశం ఉంది. కళాశాల విద్యార్థులు తయారుచేసిన వాయిస్ వీల్‌చైర్ రోగులు ఒంటరిగా ఉన్నప్పుడు ఎవరి సహాయం లేకుండా కదిలే అవకాశం ఉంటుంది. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్



నల్లగొండ కళాశాల విదార్థులు ప్రదర్శించిన ఆటోమేటిక్ రీచార్జబుల్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్

వనరున్నా.. వనమెండే



ప్రకృతిలోని జీవరాశుల మనుగడకు నీరు ప్రాణాధారం.. అలాంటి నీరు సమృద్ధిగా ఉన్నా ఎండిపోతున్న తుమ్మచెట్లు సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉండ్రుకొండ ఎర్రచెరువులో ఉన్నాయి. నీటిలో ఉన్న ఎండిపోయిన తుమ్మచెట్ల వనం హైదరాబాద్-విజయవాడ రహదారిపై ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

మిర్యాలగూడఅర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు శనివారం దాడిచేశారు. జంకుతండా శివారులో పేకాట ఆడుతున్నట్లు సమచారం అందగా దాడిచేసినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.3,500 నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకొని కేసున మోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

19 మంది జూదరుల అరెస్టు

బొమ్మలరామారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాలలో పేకాటస్థావరంపై శుక్రవారం దాడి చేసి 19మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం మర్యాల శివారులోని మామిడితోటలో పేకాడుతున్న సమాచారంతో దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడిలో రూ.81,290 నగదుతో పాటు 19 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

మేళ్లచెర్వు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా చింతలపాలెం మండలంలోనికి ప్రవేశించిన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి డ్రైవర్ పందుల వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేయవద్దని ఎస్ఐ హెచ్చరించారు.

ఒడిశా టూ హైదరాబాద్ గంజాయి సరఫరా

- ఐదుగురు యువకుల అరెస్ట్
- 26 కిలోల గంజాయి స్వాధీనం



పంతంగి టోల్‌గేట్ వద్ద గంజాయితో పట్టుబడిన నిందితులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. 26 కిలోల గంజాయి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పాత బస్తీకి చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్ (32), అబ్దుల్ ఆసిఫ్(26) మూసీన్‌ఖాన్(26), మహ్మద్ అమీర్ (25), ఫయ్యాద్ ఇస్మాయిల్(24) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. గంజాయి విక్రయిస్తే డబ్బు వస్తుందన్న అత్యాశతో ముఠాగా ఏర్పడి గంజాయి రవాణాను చేస్తున్నారు. ఈ నెల 13న రెండుకార్లలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశాఖ, రాజమండ్రి, విజయవాడల మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ గేట్ వద్ద పక్కా సమాచారం అందుకున్న రాచకొండ ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. 26కిలోల గంజాయి, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

ట్రాలీ వాహనం దగ్ధం

కట్టంగూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంజన్‌లో నుంచి ఆకస్మాత్తుగా మంటలు రావడంతో ట్రాలీ వాహనం దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని సత్యనారాయణపురం వద్ద శనివారం జరిగింది. కట్టంగూరుకు చెందిన ఏనుగు కృష్ణ అనే డ్రైవర్ తన వాహనంతో మండలంలోని కురుమర్తి గ్రామంలో గేదెలు తీసుకవచ్చేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో సత్యనారాయణపురం గ్రామం వద్ద వాహనం ఇంజన్‌లో నుంచి ఆకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో వాహనం పక్కకు ఆపాడు. మంటలుఎగిసిపడి వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.8లక్షల విలువైన వాహనం దెబ్బతిన్నట్లు డ్రైవర్ కృష్ణ తెలిపారు.



దగ్ధమైన ట్రాలీ వాహనం

కొండమల్లేపల్లిలో ఇల్లు

కొండమల్లేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో జరిగింది. బాధితుడు బుడిగపాక భిక్షమయ్య తెలిపిన ప్రకారం ఏడాది క్రితమే నూతనంగా ఇల్లు నిర్మించుకొని ఇంట్లోకి అన్ని నూతన సామాగ్రి తెచ్చుకున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన చుట్టుపక్కల వాళ్లు భిక్షమయ్యకు సమాచారం అందించారు. ఇంటికి వెళ్లేసరికి టీవీ, ఫ్రిడ్జి, తదితర వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

బస్సు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి



రమేష్(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో శనివారం జరిగింది. ఎస్ఐ ఎన్ కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చామల రమేష్(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పనినిమిత్తం కొరటికల్ గ్రామానికి వెళ్తున్నానని ఇంటి దగ్గర చెప్పి బైక్‌పై బయలుదేరారు. మండలకేంద్రంలో తిమ్మాపురం ఎక్స్‌రోడ్ వద్ద రమేష్ రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో రాయగిరి నుంచి మోత్కూరు వైపు వెళ్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రమేష్‌ను వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా రమేష్ అప్పటికే మృతి చెందాడు. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమారులు దీక్షిత్, వర్షిత్, కుమార్తె హర్షవర్ధిని ఉన్నారు. భార్య చామల ఉమ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. కాగా ప్రమాదానికి ఆర్టీసీ డ్రైవర్ కారణమని ఆరోపిస్తూ అతడి నుంచి నష్టపరిహారం ఇప్పించాలని రమేష్ తరుపు బంధువులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. చివరకు పోలీసులు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

బైక్ అదుపు తప్పి ...

తిరుమలగిరి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన కటారి నర్సింహ(40) పనినిమిత్తం వెలిశాల గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. రాత్రి సుమారు 7 గంటల సమయంలో రోడ్డు పనుల నిమిత్తం మురుగుకాల్వ కోసం తీసిన గొయ్యి వద్ద అదుపు తప్పి కిందపడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో చనిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. నర్సింహకు భార్య, కుమార్తె ఉన్నారు. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండి ఇండికేషన్ మార్క్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, అందుకు కారకులైన కాంట్రాక్టర్ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం వాటర్‌ట్యాంక్‌తండాతో పాటు పరిసర గ్రామాల్లో వినియోగదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని ఏపీ 27టీవై 2316 నెంబరుగల ఆటోలో తరలిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్లకు చెందిన బియ్యం వ్యాపారి కట్టా శ్రీనివాసరావు కొంతకాలంగా తండాలతో పాటు పరిసర గ్రామాల్లో సంచరించి లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 చొప్పున చెల్లించి కొనుగోలు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు సేకరించిన సుమారు మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనపర్చుకున్నామన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి వ్యాపారి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల దరఖాస్తులకు ఆహ్వానం

భువనగిరి రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర, బాలికల బ్యాగ్‌లాగ్ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జెల్ల స్వప్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మోటకొండూరు బాలికలు, వలిగొండ (బీబీనగర్) బాలికలు, భువనగిరి (తూప్రాన్‌పేట) బాలికలు, రాజాపేట (ఆలేరు)బాలుర, పోచంపల్లి (దేశ్‌ముఖ్) బాలుర పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం 2025-26 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20న జరిగే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులు రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేయబడుతారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.

డీపీ మార్చి, ఎస్ఐనంటూ బెదిరించి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు యువకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుప్పం ఎస్ఐ, పోలీసులమని అని చెప్పి కటకటాలపాలయ్యారు. దొంగబంగారం ఉదంతంలో కేసు లేకుండా చేస్తామని చెప్పి బంగారు షాపు యజమానిని బురిడీ కొట్టించి చివరకు పోలీసులకు చిక్కారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఎస్ఐ కార్యాలయంలో సీఐ చరమందరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యసనాలకు బానిసైన నలుగురు యువకులు పోలీసులు పేరు చెప్పి డబ్బులు సంపాదించాలని భావించారు. నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన లారీ క్లీనర్ చింతల చెరువు ప్రశాంత్, అదేవిధంగా డెకరేషన్ పనులు చేసే అదే గ్రామానికి చెందిన చింతల చెరువు అక్షిత్‌కుమార్, నల్లగొండ పట్టణం మాన్యంచెల్కకు చెందిన షేక్ ఇరాన్, అదేవిధంగా నల్లగొండకు చెందిన షేక్‌వాజీద్‌లు కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో గూగుల్‌లో ఎస్ఐల ఫొటోలు డౌన్‌లోడ్ చేశారు. ఏపీలోని కుప్పం ఎస్ఐకు చెందిన ఫొటోను డీపీగా పెట్టుకొని ట్రూకాలర్‌లో ఎస్ఐని అంటూ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని శ్రీనిధి బంగారం షాపు యజమాని తుడిమళ్ల నవీన్ ఈనెల 8న ఫోన్ చేశారు. నువ్వు కొంతమంది దొంగల నుంచి బంగారం కొన్నావు ఆ బంగారాన్ని రికవరీ చేయాలి, లేకపోతే నీపై కేసు పెట్టి జైలుకు పంపుతామని బెదిరించాడు. అతను భయపడి నిందితుడు చెప్పిన ఫోన్‌పేకు రూ.10వేలు జమచేశారు. కాగా అనుమానం వచ్చిన బంగారం షాపు యజమాని అదే రోజు హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. దీంతో ఎస్ఐ ముత్తయ్య కేసు నమోదు చేసి పరిశోధన చేశారు. ఈ క్రమంలో శనివారం వాహనాలు తనిఖీచేస్తుండగా మండలంలోని గోపాలపురం వద్ద రెండు మోటార్ సైకిళ్లపై కోదాడ వైపు వెళ్తుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరాన్ని నిందితులు అంగీకరించడంతో నలుగురిని అరెస్టు చేసి రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.25వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వెయ్యేళ్ల నాటి శిల్పాలను పరిరక్షించాలి: శివనాగిరెడ్డి



చిలుకూరు చెన్నకేశవ ఆలయంలో పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

చిలుకూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : చిలుకూరులోని చెన్నకేశవ ఆలయంలో వెయ్యేళ్ల కిందటి కల్యాణి చాళుక్యుల కాలం నాటి శిల్పాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని చెన్నకేశవ ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో పురాతన శిల్పాలను పదిలపర్చాలని సూచించారు. క్రీ.శ.1245 సంవత్సరం శాసనంలో కాకతీయ గణపతిదేవుడి మంత్రి మంచన, అలాగే ఆలయంలో 40 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు గల నల్ల శాసనపు రాతిలో చెక్కిన చెన్నకేశవుడి అపురూప శిల్పాలు ఉన్నాయన్నారు. చరిత్ర కలిగిన వీటిని భద్రపర్చి బావి తరాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సిరికొండ అనంత కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయాలు నిర్మించుకోవాలి

హుజూర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో దేవాలయాలు నిర్మించుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని గోవిందపురంలో నిర్మించనున్న రామాలయ స్థలాన్ని పరిశీలించి, సలహాలు, సూచనలు అందజేశారు. గర్భాలయం, అర్ధమండపం, మహామండపాలతో పాటు ఒక అంతస్తు ఆలయాన్ని నిర్మించాలనర్నారు. పురాతన ఆలయాలను కాపాడుకోవాలన్నారు. వాటి విలువలను ముందు తరాలకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో నారాపరాజు శ్రీనివాసరావు, ఇట్టిమళ్ల శ్రీను, బెంజిమేన్, రామకృష్ణ, నారాయణ, అరవిందరెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణ, పాపారావు, రంజిత్, క్రాంతి, రాములు, నారాయణ, రాజేష్, శ్రీను, జ్యోతి, విప్లవ, ముత్తమ్మ, జానకిరాములు, వినోద్, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనపై 'పెదవి విరుపే'..!

● చుట్టపు చూపుగా వస్తున్న ప్రత్యేకాధికారులు ● ప్రత్యేకాధికారులకు సొంత డ్యూటీలోనే చేతినిండా పని ● పడకేసిన పారిశుధ్యం ● కంపుకొడుతున్న పల్లెలు ● పట్టించుకోని పాలకులు

నార్కట్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ కాకుండా ఇతర శాఖల నుంచి ప్రత్యేకాధికారులుగా నియమితులైన చోట పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ నిర్వహణలో మరింత ఇబ్బంది ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు మినహా పంచాయతీ నిర్వహణలో ఇతర అవసరాలకోసం ఖర్చు చేసేందుకు ప్రభుత్వం నిధులు సకాలంలో ఇవ్వడంలేదు. ఇంతకు ముందైతే సర్పంచ్‌లు ఎవరుంటే వాళ్లు కొంత సొంత పెట్టుబడి పెట్టుకుని సమస్యలు పరిష్కరించేవారు. గతంలో వేసవిలో తాగునీటి ఎద్దడి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికై సర్పంచ్‌లు ఆర్థిక చేయూతనిచ్చేది. ప్రస్తుతం సర్పంచ్‌లు లేక ప్రత్యేకాధికారులున్నా పంచాయతీ కార్యదర్శులే తమ సొంత డబ్బులను వెచ్చించాల్సిన పరిస్థితి. పంచాయతీ కార్యదర్శుల అభిప్రాయాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్ల వేతనాలను 'ఇంటి' ఖర్చులకన్నా 'పంచాయతీ' కోసమే ఎక్కువ వెచ్చించాల్సి వస్తుంది. మొత్తం మీద పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనపై ప్రజల్లో పెదవివిరుపే వ్యక్తమవుతోంది. నకిరేకల్ నియోజకవర్గంలో ప్రత్యేకాధికారుల పాలన తీరును పరిశీలిస్తే..

నకిరేకల్ నియోజకవర్గంలో 126 జీపీలు

నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 126 గ్రామపంచాయతీలున్నాయి. వీటన్నింటిలో ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది. కొందరు మహిళా కార్యదర్శులు ప్రసూతి సెలవుల్లో వెళ్లగా మరి కొందరు అనారోగ్య, ఇతర సమస్యలతో దాదాపు 20 మంది వరకు సెలవులో ఉండగా పక్క జీపీ కార్యదర్శులే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు.

● నార్కట్‌పల్లి మండలం దాసరిగూడం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామస్తులకు నీటిని సరఫరా చేసే వాటర్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆ గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి తన సొంత డబ్బులు వెచ్చించి వైర్లు తెప్పించి నీటి సరఫరా పునరుద్ధరించాల్సి వచ్చింది.

● ఇదే మండలంలోని చెర్వుగట్టు మేజర్ గ్రామ పంచాయతీలో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఇటీవల పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి జాతర నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరంగా పారిశుధ్యం కోసం తీసుకున్న తాత్కాలిక రోజువారీ కార్మికులకు కూలీ డబ్బులు ఇవ్వాల్సి ఉంది. కానీ గ్రామ పంచాయతీలో కావల్సిన నిధులున్నా ప్రభుత్వం చెక్కులను పాసు చేయడం లేదు.

● నకిరేకల్ మండలంలో చాలా గ్రామాల్లో ప్రత్యేక పాలనపై విమర్శలే వినవస్తున్నాయి. ప్రత్యేకాధికారులు చుట్టపు చూపు గా వచ్చే వాళ్లే తప్ప వారికి గ్రామాల సమస్యల పరిష్కారంపై అవగాహన ఉండదంటున్నారు.

● కట్టంగూర్‌లో పారిశుధ్యం పడకేసిందన్న విమర్శలు వినపడుతున్నాయి. నిధులు లేకపోడం, కార్మికులకు వేతనాలు సకాలంలో అందక పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందన్న విమర్శలు ఉన్నాయి. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కూడా లేవు.

● చిట్యాల మండలంలో ప్రత్యేకాధికారుల పాలనతో సమస్యలు తీరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పిట్టంపల్లి, వెలిమినేడు తదితర గ్రామాల్లో డ్రైనేజీ నీళ్ల పంట పొలాలకు వెళ్తున్నాయన్న ఆరోపణలు రైతుల నుంచి వినపడుతున్నాయి.

పల్లెల్లో నీటి ఎద్దడి ప్రారంభం

చౌటుప్పల్: గ్రామపంచాయతీలకు పాలకమండలి పదవీకాలం ముగిసి ఏడాది గడిచినా, గ్రామాల్లో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. నిధుల్లేక గ్రామపంచాయతీలన్నీ నిస్తేజంలో పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి నిధులు రాకపోవడంతో గ్రామాల్లో పరిపాలన వ్యవహారం అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి నిధులు అవసరం పడుతుండడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం సొంతంగా అప్పులు తెచ్చి వాటిని పరిష్కరిస్తున్నా, ప్రధాన సమస్యలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే వేసవి సమీపించడం, భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో మునుగోడు నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది.

● చౌటుప్పల్ మండలంలో నీటిఎద్దడి ఇప్పటికే ప్రారంభమైంది. మండలంలోని కొయ్యలగూడెం, ఎల్లంబాయి, ఎల్లగిరి, దండు మల్కాపురం తదితర గ్రామాల్లో నీటిఎద్దడి తీవ్రంగా ఉంది. బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో నల్లాల ద్వారా నాలుగైదు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయి. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్న అవి ప్రజల అవసరాలకు సరిపోవడంలేదు. అవసరమైన ప్రజలు ప్రైవేటుగా ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయించి, అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

● సంస్థాన్ నారాయణపురం మండలంలో ఇప్పుడిప్పుడే మంచినీటి ఎద్దడి నెలకొంటుంది. మండలంలోని జనగాం గ్రామంలో ఇప్పటికే మంచినీటి సమస్య ప్రారంభమైంది. గ్రామంలో ప్రైవేట్‌గా బోరు అద్దెకు తీసుకొని గ్రామానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలో మంచినీటి బోర్లు రిపేర్‌కు వచ్చాయి.

● చండూరు మండలంలోని చామలపల్లి, గుండ్రపల్లి, కస్తాల, తమ్మడపల్లి, పడమటి తాళ్ల గ్రామాలలో నీటి ఎద్దడి ఏర్పడింది. పడమటి తాళ్ల గ్రామంలో మంచినీటి సమస్యపై గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా దీనికి ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. గ్రామములో బోరు వేయించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

పడకేసిన పారిశుధ్యం

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లోని గ్రామాల్లో అప్పుడే ఎండలు మండుతుండడంతోపాటు పారిశుధ్య సమస్య అస్తవ్యస్థంగా మారింది. గ్రామాలకు సరిపడా కృష్ణాజలాలు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శులకు నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారమైందని, దీంతో ఇబ్బందులుపడుతున్నామని కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు తెలుపుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో 320 గ్రామపంచాయతీలు ఉన్నాయి. దేవరకొండ, చింతపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, గుడిపల్లి, మర్రిగూడ, నాంపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి మండలాల్లోని గ్రామపంచాయతీలలో సమస్యలు నెలకొన్నాయి. పారిశుధ్య సమస్యతో ఇబ్బందులుపడుతున్నామని, డ్రైనేజీలలో మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

మిర్యాలగూడ: గ్రామాల్లో ప్రగతి మందగించింది. పల్లె ప్రజలను సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఏడాదిగా గ్రామాల్లో పాలకమండళ్లు లేక గ్రామసభలు జరగక అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు అవసరమైన తాగునీటి బోర్ల ఏర్పాటు, మోటార్ల మరమ్మతు, పైపులైన్ల లీకేజీ రిపేర్లు, విద్యుత్ వీధిదీపాలు, మురుగు కాల్వ నిర్వహణ పనుల్లో పురోగతి లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల కార్యదర్శులు విద్యుత్ దీపాలు, బోరు మోటార్లు మరమ్మతులతో పాటు పైపులైన్ల లీకేజీలకు స్వంత డబ్బులు వినియోగించి పనులు చేసినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఇక ముందు పనులు చేపట్టలేమని చేతులెత్తేస్తున్నారు. వివిధ మండలాల్లోని అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేస్తోంది. అడవిదేవులపల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని వాపోతున్నారు. గ్రామంలోని అంతర్గత రోడ్ల పక్కన కంపచెట్లు పెరిగి చెత్తా చెదారంతో వీధులు పేరుక పోతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో వేసవి మూడు నెలల యాక్షన్ ప్లాన్ ఖరారు చేసినప్పటికీ ఆ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వ్యయ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోందని వాపోతున్నారు.




కొండమల్లేపల్లి సాగర్‌రోడ్డులో కాలనీలో పారుతున్న మురుగునీరు, అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెంలో పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

జాడలేని ప్రత్యేకాధికారులు

నిండిన మురుగు కాల్వలు, పట్టించుకునే వారేరీ?

మద్దిరాల: సర్పంచ్‌ల పదవి కాలం 31 జనవరి 2024 ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామానికి వివిధ శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. వారు నియామకమై నెలలు గడుస్తున్నా ఆవైపు కనీసం ఒక్కసారి కూడా కన్నెత్తి చూడటంలేదు. దీంతో గ్రామాలు కంపు కొడుతున్నాయి. మురుగు కాల్వలు నిండాయని, వీధులు కంపు కొడుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు కన్నెత్తి చూడకుండా తమ గోడును వినిపించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వలు నిండి దోమలకు నిలయాలుగా మారాయి. ప్రత్యేకాధికారుల పాలన నాటి నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని కార్యదర్శులు చెబుతున్నారు. సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నామంటున్నారు.

మూడు రోజులకు ఒకసారి



దేవరకొండ మండలం కొండభీమనపల్లికి మూడు రోజులకు ఒక్కసారి భగీరథ నీరు వస్తున్నప్పటికి సరిపడడంలేదు. బోరు బావులు లీజుకు తీసుకొని సరిపడ నీరు అందించాలి. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదు. గ్రామాలలో కంపచెట్లు పెరిగిపోయి డ్రైనేజీ కాలువలు దురువాసన వస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలి.

ఎర్ర ఆంజనేయులు, కొండభీమనపల్లి, దేవరకొండ మండలం

కొరవడిన పర్యవేక్షణ



కనగల్ మండలంలో అస్తవ్యస్తంగా మురుగు కాల్వ

నల్లగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో నల్లగొండ నియోజకవర్గంలోని నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక పాలనకు ఏడాదికాలం పూర్తి కావొస్తున్నా, అధికారుల పర్యవేక్షణలేక సమస్యలు తిష్ఠవేసి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్య తీవ్రంగా పీడిస్తుంది. కనగల్ మండలంలో మురుగు కాల్వ నిర్వహణ అస్థవ్యస్థంగా తయారైంది. డ్రైనేజీ నీటి నిల్వలతో దోమలు వ్యాప్తిం చెంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. నల్లగొండ మండలంలో అధికారుల పాలనతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయి. వేసవి తీవ్రతతో నీటి సమస్య పెరిగింది. మోటార్లు కాలిపోవడంతో వాటిని రిపేరు చేయించడానికి గ్రామపంచాయతీల్లో నిధుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యేకాధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు వాటిని మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామాల్లో 5 నుంచి 10 రోజుల వరకు కూడా బోరునీరు సరఫరా కావడం లేదు. మిషన్ భగీరథ నీరు అడపదడపా అరకొరగా సరఫరా అవుతున్నాయి. దీంతో ప్రజలు కృష్ణా జలాలు సరఫరా కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో వారం రోజులక్రితం గ్రామంలోని బోర్లు కాలిపోయినప్పటికీ మరమ్మతులు చేయించ లేదు. దీంతో ఆ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రతరం అయింది. తిప్పర్తి మండలంలో సైతం అదే పరిస్థితులున్నాయి. మండలవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మండలంలోని మేజర్ గ్రామపంచాయతీలు మినహా 26 గ్రామపంచాయతీల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

హుజూర్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎండిన పంట పొలాలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు. శనివారం పట్టణంలోని వర్తక సంఘంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. స్వామినాథన్ కమిషనర్ సిపారుస్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలపై చట్టం చేయాలన్నారు. 20 ఏళ్లుగా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్‌లో రైతు తృతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతువ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రైతు రుణమాఫీ, రైతు ఆత్మీయభరోసా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కోప్పోజు సూర్యానారాయణ, గుండు వెంకటేశ్వర్లు, బొల్లు ప్రసాద్, పాపిరెడ్డి, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, ధనుంజయ్‌నాయుడు, లక్ష్మయ్య, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, ఉమ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలు

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఆధునిక సాంకేతిక ద్వారా పంటల సాగు విధానంపై శాస్త్రవేత్తలతో మాట్లాడటంతోపాటు వారి సలహాలు, సూచనలు తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మరిన్ని వేదికల్లో రైతు నేస్తం కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం మండలానికి ఒక రైతు నేస్తం కేంద్రం ఉండగా, మండలానికి మరో రెండుచోట్ల అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో కేంద్రంలో సుమారు రూ.3లక్షలకు పైగా సాంకేతిక పరికరాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం ప్రతీ 5వేల హెక్టార్లకు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)నియమించింది. ఈ వేదికల్లోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో మరిన్ని కేంద్రాల్లో సేవలు అందించిన పక్షంలో రైతులకు సాంకేతిక విజ్ఞానం అందించేందుకు వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

తేదీన పరీక్ష ప్రశ్నపత్రాలకు సంబంధించిన కవర్‌ను సీల్ తొలగించి ఓపెన్ చేయగా, అందులోనే ఏడో రోజున నిర్వహించే ఒకేషనల్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఉన్నాయి. అప్పటి కే అక్కడికి చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృం దం ఏడో రోజు ప్రశ్నపత్రాలున్న విషయాన్ని గుర్తించింది. దీంతో బెంబేలెత్తిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో చర్చించిన పిదప ఆ ప్రశ్నాపత్రాలను తిరిగి కవర్‌లో సీల్ చేసి వెంటనే పోలీస్ స్టేషన్‌కు పంపారు. అయితే ఏమరుపాటుగా ఉండి, ఆ ప్రశ్నాపత్రాలను సైతం విద్యార్థులకు పంపిణీ చేసినా, లేదా పట్టించుకోకుండా అక్కడే వదిలేసినా ప్రశ్నపత్రాలు లీక్ అయ్యేవని చెబుతున్నారు. ప్రశ్నపత్రాలను ప్యాక్ చేసే సందర్భంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, ఒకేషనల్ పేపర్లు కావడం వల్ల అంత సీరియస్‌గా కనిపించకపోయినా, అదే స్థానంలో ఇతర సబ్జెక్టుల ప్రశ్నపత్రాలైతే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండేదోనని, పేపర్ లీక్ అయినట్లే భావించాల్సి వచ్చేదని పలువురు ఇన్విజిలేటర్లు, అధ్యాపకులు వాపోతున్నారు. ఎంతో జాగ్రత్తగా, పకడ్బందీగా చేపట్టాల్సిన ప్రశ్నపత్రాల ప్యాకింగ్ పనులను పూర్తి నిర్లక్ష్యంగా చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నపత్రాల రాంగ్ ప్యాకింగ్‌పై ఇంటర్‌బోర్డుకు ఇప్పటికే సమాచారం అందింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, బాధ్యులైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తుల సీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవ లో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయం త్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.40,79,877 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

గుట్ట స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనార్థం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కుటుంబ సమేతంగా శనివారం యాదగిరిగుట్టకు వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు.

పంటలకు వెంటనే సాగునీరు అందించాలి

● *బీజేపీ కిసాన్‌మోర్చా*

జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి



ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

తిప్పర్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎండిపోతున్న పంటలను కా పాడేందుకు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సాగునీరు అందివ్వాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని మామిడాల గ్రామంలో ఎండిపోతున్న పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల తో మాట్లాడారు. సాగునీటి వినియోగం, ఎప్పటి నుంచి నీరు వస్తుందనే అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డి-40 కాల్వ ఇవ్వాల్సిన నీటిని వారబందీ పేరుతో మరోపక్కకు మళ్లించడం వలన కాల్వ నీటిని నమ్ముకొని సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపో తున్నారని అన్నారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి కూడా తమ సొంత నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఒక్క గ్రామంలోనే 150ఎకరాలకు పైగా చేతికి వచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సాగునీరు కావాలని అడిగిన రైతులపై కేసులు కూడా పెట్టించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం స్పందించని యెడల రైతుల సమస్యలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి రవి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, ఎ. నవీన్, మహేష్, సైదులు, బొల్లెద్దు మనోజ్, చెన్నకేశవులు, మం డారి చంద్రయ్య, రాయి శ్యామ్, అనుములపురి జానయ్య, తండు కిరణ్, నవీన్, శివ, వెంకటేశ్వర్లు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు కేసీసీ పత్రాలను అందజేస్తున్న టీజీఎం ప్రాంతీయ మేనేజర్ విజయ్ భాస్కర్, పశుసంవర్ధక శాఖ జీడీ రమేష్

మునుగోడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశ్యంతో అందజేసే కిసాన్ క్రెడిట్‌కార్డుల (కేసీసీ)ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ బి.విజయ్‌భాస్కర్, పశుసంవర్ధకశాఖ జేడీ. డాక్టర్ జీవీ రమేష్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మునుగోడు గ్రామీణ బ్యాంకు ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలో ఎంపికైన 10 మంది పాడిరైతులకు రూ.6.20లక్షల విలువైన కేసీసీ మంజూరుపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడిరైతులకు పాడి సంరక్షణ, వాటి నిర్వహణ కోసం హామీ లేకుండా కేసీసీలు దోహదపడతాయన్నారు. ఒక్కో పశువుకు రూ.25 వేల లెక్కన కేసీసీ కార్డు ద్వారా రుణం పొందవచ్చని సూచించారు. ఆ రుణాలకు 7శాతం వడ్డీ ఉంటుందని, నిర్దేశించిన ప్రకారం గడువులో రుణం తిరిగి చెల్లించే రెన్యూవల్ చేసుకుంటే 4 శాతం మాత్రమే వడ్డీ వర్తిస్తుందని, మిగిలిన 3 శాతం కేంద్రప్రభుత్వం బ్యాంకులకు నేరుగా చెల్లిస్తుందని వివరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మునుగోడు బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌కిరణ్‌రావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.వెంకన్న చండూరు, చిట్యాల పాలకేంద్రాల మేనేజర్లు, పాలసేకరణ చైర్మన్లు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి



మోత్కూరు సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

మోత్కూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని స్ఫూర్తి భవన్‌లో నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. త్రిఫ్ట్ ఫండ్ పథకంలో చేనేత కార్మికుడు రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.600 చొప్పున చెల్లించేలా పథకం రూపొందించి, చేనేత కార్మికుడితో పాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు అవకాశం కల్పించాలన్నారు. అందులో ఒకరు రూ.800 చెల్లిం చేలా, మరొకరు రూ.600 చెల్లించేలా చూడాలన్నారు. రూ.లక్ష రుణ మాఫీ అమలుకు నోచుకోలేదన్నారు. సుమారు 11 ఏళ్లుగా సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంఘాలు నిర్వీర్యమవుతున్నాయన్నారు.సమావేశంలో వం గరి రాములు, చంచు లక్ష్మయ్య, వేముల నర్సయ్య, రేగోటి శ్రీనివాస్, దోర్నాల మచ్చగిరి, సోమయ్య, రాజారాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం చేయాలి

వలిగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మానవాళికి జ్ఞానాన్ని అందించి భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠనం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు దేవేందర్, శంకర్ తెలిపారు. మండలంలోని గొల్నేపల్లి గ్రామంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన 101 ఆధ్యాత్మిక రచనలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉగాదిపై ప్రజలకు అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ జనగామ, చేర్యాల, తొర్రూరు కమిటీ సభ్యులు కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు లింగస్వామి రాము, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సాయిరాజు, అశోక్, బుచ్చిబాబు, లలిత ధనలక్ష్మి మంజుల పాల్గొన్నారు.

CLASSIFIEDS

10th మెమో పోయినవి

★ నేను అనగా సుల్తాన్ వెంకటేశ్వర్లు, తండ్రి: మారయ్య, గ్రా॥&మం॥ నకిరేకల్, జిల్లా నల్లగొండ. తేది: 12.03.2025న సూర్యాపేట నుండి నకిరేకల్ ఆర్.టి.సి బస్సులో ప్రయాణిస్తుండగా నాయొక్క 10వ తరగతి మెమో మరియు ఐ.టి.ఐ సర్టిఫికేట్స్ పోయినవి. దొరికిన వారు సంప్ర॥ సెల్ : 9542574827

AJY_224172

PLOT FOR SALE

★ హైదరాబాద్ నుండి 35 కి.మీ.. ఫ్యూచర్ సిటీ. శ్రీశైలం హైవే మహేశ్వరంలో 100 చ.గజాల ప్లాటు కేవలం రూ/- 6 లక్షలు మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. Cont: 8008091512 AJH-002923

ఆర్య వైశ్య అమ్మాయి కావలెను

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. 1వ ఆర్య వైశ్య అబ్బాయి 1989, పార్ట్‌టైమ్ లెక్చరర్, M.Ed., జూ.డి కాలేజ్, 30 వేలు, వ్యవసాయం, ఆస్తి 80 లక్షలు, నల్లగొండ, 9121325068.

AJY_224167

బోర్ పాయింట్ (జియాలజిస్ట్)

★ ఆధునిక పరికరాలతో బోర్ పాయింట్ చూడబడును. ఎస్. నరహరి, M.Sc Gologist, O.U, సంప్రదించండి : 9347182812.

AJY_224168

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413365 9985413656
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 9985410384

'కృతజ్ఞతా సభను జయప్రదం చేయాలి'

శాలిగౌరారం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు జరిగే ప్రభుత్వ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల వారు మాట్లాడారు. సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు కనగల్‌కు మంత్రి కోమటిరెడ్డి రాక

కనగల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం కనగల్‌లో పర్యటించనున్నట్లు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఏఎమ్మార్పీ సాగునీటి కాల్వలతో పాటు కనగల్ మైల సముద్రం చెరువును మంత్రి పరిశీలిస్తారని వివరించారు. కాల్వల నిర్వహణపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేయనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో భూ రికార్డులు

యాదగిరి, తహసీల్దార్, శాలిగౌరారం



ఇంటర్వ్యూ
Interview

శాలిగౌరారం మండలంలోని భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు తహసీల్దార్ పి. యాదగిరి తెలిపారు. మండలంలో 19,676 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చామని, ఇంకా 1156 మందికి ఇవ్వాల్సి ఉన్నట్లు ఆయన తెలిపారు. (శాలిగౌరారం,ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని రెవెన్యూ గ్రామాలున్నాయి?

తహసీల్దార్: మండలంలో మొత్తం 20 రెవెన్యూ గ్రామాలున్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలవ్యాప్తంగా ఎన్ని ఎకరాల భూమి ఉంది?

తహసీల్దార్: మండలంలో మొత్తం 9,496 సర్వే నెంబర్లకు గాను 52,700 ఎకరాల భూమి ఉంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని పట్టా భూములు ఉన్నాయి?

తహసీల్దార్: మండలంలో 8,777 సర్వే నెంబర్లకు గాను 44,945 ఎకరాల భూమి పట్టాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇంకా ఏఏ రకాల భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి?

తహసీల్దార్: మండలంలో ప్రభుత్వ భూములు 4,644 ఎకరాలు, శిఖం భూములు 2,812 ఎకరాలు భూదాన్ 104 ఎకరాలు, ఎండోమెంట్ భూములు 191 ఎకరాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారు? ఇంకా ఎంతమందికి ఇవ్వాలి?

తహసీల్దార్: మండలంలో ఇప్పటి వరకు 19,676 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాము. ఇంకా 1156 మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. ఆన్‌లైన్ పెండింగ్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇస్తున్నారా?

తహసీల్దార్: మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికి పరిశీలించి సకాలంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నాం.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి




చండూరు మండలంలోని పడమటితాళ్ల గ్రామంలో ట్యాంకుల ద్వారా నీటి సరఫరా

- మునుగోడు నియోజకవర్గంలో నీటి కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మర్రిగూడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభానికి ముందే మునుగోడు నియోజకవర్గంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఎండలు మండుతుండటంతో అప్పుడే తాగునీరు సమస్య మొదలైంది. గత సంవత్సరంలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడం వల్ల తాగునీటి కోసం తంటాలు పడే పరిస్థితి నెలకొంది. దీంతో నియోజకవర్గంలోని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, మునుగోడు, గట్టుప్పల్, చండూరు, నాంపల్లి, మర్రిగూడ మండలాల్లో తాగునీటి ఎద్దడి కనిపిస్తుంది. కుంటలు, చెరువులు ఎండిపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పల్లెల్లోనూ దాహం కేకలు వినిపిస్తున్నాయి. చౌటుప్పల్ మండల కేంద్రం, మునుగోడు మండలంలోని రత్తిపల్లి, చండూరు మండలంలోని పడమటి తాళ్ల, గుండ్లపల్లి, చామలపల్లి, కస్తాల, మర్రిగూడ మండలంలోని అజలాపురం, తమ్మడపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతుంది. ముఖ్యంగా చౌటుప్పల్ మండల కేంద్రంలో, చండూరు మండలంలోని పడమటి తాళ్లలో మంచినీటి ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అక్కడక్కడా మంచినీటి రక్షిత బోర్లల్లో మంచినీరు తగ్గుతున్నట్లు తెలుస్తుంది. ఫిల్టర్ నీరు కొనుగోలు చేస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రజలు నీటి కోసం ఆందోళన చెందుతున్నారు. అధికారులు తాగునీటి ఎద్దడి నివారణ కోసం తాగునీటిని పొదుపుగా వాడుకోవాలంటూ పలు గ్రామాల్లో ముందస్తుగా ప్రజలకు నీటి ఎద్దడి నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



వేసవి కాలం ప్రారంభమవుతున్నందున భూగర్భజలాలు అడుగంటిపోయే పరస్థితి నెలకొంది. ముందస్తుగా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతానికి మం డలంలో మంచినీటి ఎద్దడి ఏమీ లేదు. ఒకవేళ నీటి ఎద్దడి ఉందని సమాచారం వస్తే నీటిఎద్దడి తీర్చేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

- మున్నయ్య, ఎంపీడీవో, మర్రిగూడ

తాగునీటి కోసం చర్యలు చేపట్టాలి



మండలంలో తాగునీటి కష్టాలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. నీటి సరఫరా అయ్యేందుకు అప్రమత్తంగా ఉండి ప్రజలు కష్టాలు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- బూరుగు నాగరాజు, మర్రిగూడ

తోలు ఉత్పత్తిదారులను వెంటనే ఆదుకోవాలి



తోలు ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న నాగార్జున

నాంపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తోలు ఊనకం ఉత్పత్తిపై ఆధారపడిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని చి ట్టెంపహాడ్ గ్రామంలో సీపీ ఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాటలో భాగంగా శనివారం తోలు ఊనకం దారుల కుటుంబాలను కలిశారు. వారి సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. మండలంలోని చిట్టెంపాడు గ్రామంలో దళితులు 40ఏళ్లుగా తోలు ఊ నకం ఉత్పత్తి మీదనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపా రు. తోలుకు అవసరమైన తంగేడు చెట్ల పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చిట్టెంపహాడ్ గ్రామ దళితుల సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 24,25 తేదీల్లో నాంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే రిలే నిరాహా ర దీక్షలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి, మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, మండల నాయకులు కొమ్ము ల క్ష్మయ్య, రాఘవాచారి పెరుమాండ్ల కృష్ణ, బుషిపాక సాయిలు, ముత్తయ్య, ప్రసాద్, శ్రీను, రాములు, యాదయ్య, లక్ష్మయ్య, బజారు, పెద్దయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలోని కనక దుర్గ ఆలయ వార్షికోత్సవాల్లో శనివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాంత్రికమైన మానవ జీవనంలో దైవచింతనతో మానసిక సాంత్వన లభిస్తుందన్నారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాతసేవ, అభిషేకా లు, గణపతి పూజ, స్వస్తివాచనం, మంటపారాధన, దుర్గాహోమం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, నాయకు లు ఎద్దులపురి కృష్ణ, వనమా వెంకటేశ్వర్లు, ఆలయకమిటీ సభ్యులు విమల, గంజి వెంకటేశం, నర్సిరెడ్డి, లింగయ్య, సాయిలు, నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్వావసు సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

శాలిగౌరారం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామంలోని పార్వతీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో వావిలాల వారి విశ్వావసు నామ పంచాగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా కార్యదర్శి రామడుగు వెంకట్రామశర్మ, వావిలాల వేణునాథశర్మ, వావిలాల రామలింగయ్య శర్మ, వెంకటేశ్వరశర్మ, ప్రశాంత్‌శర్మ, లక్ష్మీనర్సయ్య శర్మ, తల్పసాయి శాస్త్రి, శేషం నరసింహచార్యులు, శేషం రత్నమాచార్యులు, లక్ష్మీప్రసాద్, నాగఫణిశర్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

నల్లగొండటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ భరత్, డాక్టర్ బాలు సూచించారు. ప్రభుత్వం బీసీ కళాశాల బాలుర వసతిగృహం ఏ, బీలో శనివారం మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు వివిధ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వసతిగృహ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో సంజీవయ్య, వసతిగృహ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శు లు బి.రణదివే, సత్యనారాయణ, ఏఎన్ఎం నాగమణి, ఆశావర్కర్ సుబేదారు పాల్గొన్నారు.

18న కట్టంగూరు పశువుల సంత వేలం

కట్టంగూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కట్టంగూరు పశువుల సంత వేలం పాటను ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల సంత వేలంతో పాటు అదేరోజు పైబజారు వేలంపాట కూడా నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు పశువుల సంతకు రూ.2లక్షల డీడీ, తైబజారుకు రూ.1లక్ష డీడీ తీసి ఈ నెల 17వ తేదీలోపు కట్టంగూరులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ పశువుల సంత వేలంపాటను కట్టంగూరులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 18వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ప్రజల్లో నాలుకలా మెలిగిన యాదగిరి

నార్కట్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి ప్రజల్లో నాలుకలా మెలిగాడని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న అన్నారు. కల్లూరి యాదగిరి జయంతి సందర్భంగా శుక్రవారం ఎల్లారెడ్డిగూడెంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యాదగిరి మృతి పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెర్కు పెద్దులు, దండు రవి, కొప్పు శ్రవణ్, అంతటి సత్యనారాయణ, మాదగోని సైదులు, కల్లూరి సుందర్, కిరణ్, బొంగు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించడం అభినందనీయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ గిరి

రామగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ జాతికి చెందిన దాసోజు శ్రవణ్‌కుమార్‌కు ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అధినాయకత్వం అవకాశం కల్పించడం అభినందనీయమని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, ప్రధాన కార్యదర్శి ఇనుగుర్తి, గోపి అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విశ్వబ్రాహ్మణ పాత్ర అత్యంత కీలకమైన పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి పునాదులు వేసిన జయశంకర్ సార్‌తో మెదలుకుంటే ఉద్యమంలో తొలుత అశువులు బాసిన శ్రీకాంతాచారి వరకు విశ్వబ్రాహ్మణులేనని పేర్కొన్నారు. మిగతా పార్టీల నేతలు కూడా విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి గొట్టిముక్కల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ చారి, కన్నెకంటి సత్యం, కటకం రమేష్, గౌరవ అధ్యక్షుడు కూరెళ్ల మదనాచారి, నాయకులు జిల్లేపల్లి విజయ్‌కుమార్, సోల్లేటి కృష్ణకుమార్, వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, విష్ణుమూర్తి, చంద్రశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

● నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

కేతేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధరణితో పాటుగా ప్రజల నుంచి అందిన ఎలాంటి దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్ని దరఖాస్తులు అందాయి, ఎన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనేది అంశాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సూచించే బోర్డు లేకపోవడాన్ని గమనించిన ఆయన తక్షణమే బోర్డు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, డీటీ సత్తార్, ఎంఆర్ఐ వెంకన్న, ఏఆర్ఐ రామచంద్రయ్య పాల్గొన్నారు.

బీసీలకు అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ యువజన సంక్షేమ నాయకుడు దీపేందర్

నల్లగొండటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో కామారెడ్డి డిక్లరేషన్ కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో బీసీల గణాంకాలు అందుబాటులో లేనందున తక్కువ నిధులు కేటాయించారని, ప్రస్తుతం బీసీల జనాభా లెక్కలు ఉన్నందున బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, జక్కలి సాయిరాం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



తుమ్మలపల్లి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ భాస్కర్

నార్కట్‌పల్లి, చండూరురూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లిలో సాల గ్రామ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవీ భూదేవీలతో పాటు వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ముగ్ధమనోహరంగా అలంకరించారు. యాదగిరిగుట్ట దేవస్థానం మాజీ ముఖ్య అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, అక్కెనపల్లి సాల గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు కారంపూడి చెన్నకృష్ణమాచార్యుల యాజ్ఞీకంలో కల్యాణ తంతు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు తలంబ్రాల బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఉత్సవంలో ఆలయ నిర్మాణదాత కసిరెడ్డి సుదర్శన్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని తుమ్మలపల్లి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ ఉత్సవాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. భాస్కర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. తెల్లవారుజామున పుష్పక విమాన రథోత్సవము నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి అంబటి నాగిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ గున్‌రెడ్డి రమ్యారామలింగారెడ్డి, కురుపాటి వెంకటమ్మ, బోయపల్లి రాములు, జిల్ల నర్సింహ, కారువంగ నర్సింహశర్మ, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టాన్ని తీసుకురావాలి



శాలిగౌరారం: దీక్షలో పాల్గొన్న ఎమార్పీఎస్ నాయకులు

శాలిగౌరారం, చిట్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టానికి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేడ్కర్ మాదిగ డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక నిరసన నిరాహార దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత కల్పించాలని అన్నారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు బట్ట శ్రీనివాస్, బట్ట సైదులు, బాకీ వెంకన్న, మొలుగూరి సోమయ్య, వేముల శ్రీకాంత్, యాదయ్య, రఘు, మస్తాన్, సతీష్, తిరుమలేష్, కల్యాణ్, సతీష్, బిక్షం, దేవరకొండ లక్ష్మణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందేవరకు రాష్ట్రంలో ఉద్యోగాలను భర్తీ చేయవద్దని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ డిమాండ్ చేశారు. చిట్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి చేపట్టిన నిరసన దీక్షలు చిట్యాలలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎరసాని గోపాల్, నోముల పురుషోత్తం, జిట్ట స్వామి, గణేష్, యాదయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కాలం దగ్గర పడింది : కిషోర్‌కుమార్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

శాలిగౌరారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి కాలం దగ్గర పడిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని మాదారం, ఇటుకులపహాడ్, వల్లాల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి ప లు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వల్లాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షు డు జంగలి మారయ్య, నాయకులు జంగలి సత్తయ్యతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కిషోర్ కుమార్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో అరాచకాలు, అవినీతి ఎక్కువైందని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారన్నారు. మళ్లీ కేసీఆర్ పాలన వస్తే బాగుంటుందని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మామిడి సర్వయ్య, శేఖర్‌బాబు, జేరిపోతుల చంద్రమౌళి, నాయకులు అక్కినేపల్లి శ్రీరాములు, శేషరాజుపల్లి వెంకన్న, చిపుట సైదులు, భూపతి ఉపేందర్‌గౌడ్, నర్సయ్య, గణేష్, రవీందర్, దావీద్, కృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదల సమస్యలను పరిష్కరించాలి



చిట్యాల: చిన్నకాపర్తిలో ఎండిన వరి చేనును పరిశీలిస్తూ రైతుతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మర్రిగూడ, చిట్యాలరూరల్, కేతేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా సీపీఎం నాయకులు శనివారం మర్రిగూడ, చిట్యాల, కేతేపల్లి మండలాల్లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు భూమిలేని నిరుపేదలకు వెంటనే ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం 2009 సంవత్సరంలో ఇళ్ల స్థలాల కోసం మేటిచందాపురం పరిధిలో 3.11ఎకరాల భూమిని సేకరించిందని, దానిని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని వినతిలో పేర్కొన్నారు. అదేవిధంగా యరగండ్లపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 724, 725లో 9.32 ఎకరాల భూమిని సేకరించారని, అది నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని కూడా నిరుపేదలకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నీలకంఠ రాములు, రామలింగేశ్వరాచారి, దామెర లక్ష్మి, ఏడుకొండ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి లో సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండి న వరి పంటలను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. వరి పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి పంటనష్టం రూ.25వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సాగునీరందకపోవడంతో పంటలు ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. చిన్నకాపర్తి గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కోనేటి రాములు, రూపని ఇద్దయ్య, శిర్సు హన్మయ్య, వీరమళ్ల వెంకటేశ్వర్లు, దేశపాక సైదులు, రుద్రారపు పార్వత మ్మ, జయమ్మ, గోపమ్మ, దేశపాక ఐలయ్య, చంద్రయ్య, శంకరయ్య, నర్సింహ, యాదగిరి పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల నుంచి మోదుగులకుంట మీదుగా నకిరేకల్ వరకు ఉన్న లింకు రోడ్డును బీటీగా మార్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకులు మాట్లాడుతూ 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ రోడ్డును బీటీగా మార్చేందుకు శంకుస్థాపన చేసినా నేటికీ రహదారిగా మారలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు పి.లింగయ్య, మన్నెం దుర్గ, బట్టు సత్తయ్య, భగవంత రెడ్డి, కె.నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ నిరసన

నకిరేకల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ నాయకులు నకిరేకల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, రాచకొండ వెంకన్న, యానాల లింగారెడ్డి, ప్రభాకర్‌రావు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


కంప్యూటర్ ఆధారంగా ప్రత్యేక తరగతులు

చిట్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వారి కోసం ప్రత్యేకంగా కంప్యూటర్ ఆధారితంగా ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్లు చిట్యాల మండల విద్యాధికారి సైదానాయక్ అన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలో శనివారం కంప్యూటర్ ఆధారిత గదిని శనివారం ఆయన ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

3

ఆదివారం 16 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 21.5

వ్యవసాయరంగంలో సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు ప్రభుత్వం పూనుకుంది. పంటల సాగులో వస్తున్న మార్పులతో పాటు శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎప్పటికప్పుడు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతులు సేంద్రీయ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాల వినియోగంతోపాటు పంటల దిగుబడి పై తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించనుంది. సాగులో సాంకేతిక అంశాలపై నిరంతరం రైతులకు అవగాహన కల్పించనుంది. రైతులకు ప్రస్తుతం అందుతున్న సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలు

- 'రైతు నేస్తం' కేంద్రాల పెంపునకు సన్నాహాలు
- అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు చర్యలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 315 రైతు వేదికల్లో 77 'రైతు నేస్తం' కేంద్రాలు
- మండలానికి మరో రెండు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రతినెలా నిధుల మంజూరు యోచన
- స్థలం ఉంటే గోదాముల నిర్మాణం

రైతులకు ఆధునిక సాంకేతికను అందించడం, దిగుబడుల సాధన, సమస్యలపై చర్చించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఉమ్మడి జిల్లాల్లో క్లస్టర్ల వారీగా వీటిని నిర్మించారు. రైతు వేదికల ద్వారా రైతులకు పంటల సాగు, దిగుబడితోపాటు పంటల మార్పిడి వంటి తగిన సూచనలు ఈవేదికల ద్వారా వ్యవసాయాధికారులు అందిస్తున్నారు. అయితే రైతు వేదికలను బలోపేతం చేసి, వీటి ద్వారా రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలందించనుంది. వీటి నిర్వహణకు ప్రతీ నెల నిధులు విడుదల చేసేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా ఉన్న రైతు వేదికలపై సమగ్ర సమాచారాన్ని వ్యవసాయశాఖను కోరింది. జిల్లాలో ఎన్ని రైతు వేదికలు ఉన్నాయి? వీటిలో రైతులకు సేవలందించేందుకు ఉన్న పరికరాలు (టీవీ,ప్రొజెక్టర్, ఇంటర్నెట్) ఏంటి? మౌలిక వసతు లుఉన్నాయా? రైతులకు అందుబాటులో ఉన్నా యా?అనే పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది.

315 రైతువేదికలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 315 వరకు రైతువేదికలు ఉన్నాయి. వీటిలో యాదాద్రి జిల్లాలో మొత్తం 17 మండలాల్లో 92 రైతు వేదికలు, నల్లగొండ జిల్లాలో 140, సూర్యాపేట జిల్లాలో 83 వరకు రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ వేదికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి నిధులు మంజూరు కావడంలేదు. వ్యవసాయశాఖ అధికారులే సొంతంగా ఖర్చులు భరిస్తున్నారు. అయితే రైతులకు ఉపయోగపడేలా మరిన్ని సేవలందించేందుకు వీటిని తీర్చిదిద్దేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం కార్యరూపం దాల్చితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

మరిన్ని రైతు నేస్తం కేంద్రాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరిన్ని రేతు నేస్తం కేంద్రాలను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం 315 రైతువేదికల్లో 77చోట్ల రైతు నేస్తం సేవలు అందుతున్నాయి. వీటిలో రైతులు నేరుగా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే అవకాశం..

- మిగతా 5వ పేజీలో...

మరిన్ని వేదికల ద్వారా సేవలు



రైతు వేదికల ద్వారా మరిన్ని సేవలందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 'రైతు నేస్తం' కేంద్రాలను విస్తరించనున్నాం. వీటిని బలోపేతం చేసి, రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. జిల్లాలోని రైతు వేదికలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం ఎంపిక చేసిన కేంద్రాలకు సాంకేతిక పరికరాలు మంజూరు కానున్నాయి. మండలానికి రెండుమూడు చొప్పున 'రైతు నేస్తం' కేంద్రాలు ఏర్పాటుకానుండటంతో, రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

- గోపాల్, యాదాద్రి జిల్లా వ్యవసాయాధికారి

గోదాముల నిర్మాణం సైతం

రైతువేదికలు ప్రస్తుతం సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడుతున్నాయి. ఒక్కోచోట 10 గుంటల నుంచి మొదలు ఎకరానికి పైగా ఉన్న స్థలాల్లో వీటిని నిర్మించారు. అయితే సమావేశాలతో పాటు అవసరాన్ని బట్టి గోదాములు, విత్తనాలు, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వీటిని వినియోగించుకుంటున్నారు. ఈ వేదికలు నిర్మించిన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే గోదాములు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. వానాకాలం, యాసంగిలో రైతులు పండించిన పలు పంటల దిగుబడిని భద్రపరిచేందుకు సరైన గోదాములు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థలం ఉంటే ఆయా ప్రాంతాల్లో గోదాములు నిర్మించనున్నారు.



ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం

- ఆరో రోజు కవర్‌లో ఏడో రోజు ప్రశ్నపత్రాలు
- బెంబేలెత్తిన పరీక్షల నిర్వహణ అధికారులు
- ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడే ఉండడంతో తక్షణం దిద్దుబాటు చర్యలు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నల్లగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో అధికారుల నిర్లక్ష్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. ఎంతో జాగ్రత్తగా, ఏ రోజు పరీక్షలకు సం బంధించిన ప్రశ్నపత్రాలను ఆ రోజు మాత్రమే, మూడేసి సెట్ల మేర ప్యాక్ చేయాలి. అయితే మరో రోజుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సైతం ముందు రోజు ప్యాకెట్‌లో కలిపేసిన అం శం పరీక్షల నిర్వహణ అధికారులను, కేంద్రాల నిర్వాహకులను బెంబేలెత్తించింది. ప్రశ్నపత్రాల కవర్ సీల్ తెరిచాక అదనపు మరుసటి రోజు ప్రశ్నపత్రాలు అదనంగా ఉండటంతో సదరు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి హడావుడిగా వాటిని మళ్లీ కవర్లో భద్రపరచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఓఇంటర్ పరీక్షా కేంద్రంలో జరిగిన ఈ తతంగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆరో రోజు కవర్లో ఏడోరోజు ఒకేషనల్ పేపర్లు.

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఓ పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల ప్యాకేజీలో లొసుగులు బయటపడ్డాయి. అన్ని పరీక్షా కేంద్రాలకు పంపినట్లే ఇక్కడ పరీక్షలు రాసే విద్యార్థులకు అనుగుణంగా అవసరమైన ప్రశ్నపత్రాల కవర్లను ఇంటర్‌బోర్డు, డీఐఈవో నుంచి పోలీస్ బందోబస్తు నడుమ పరీక్షల ప్రారంభానికి ముందే కేంద్రానికి వచ్చాయి. అక్కడ వచ్చిన పేపర్లను, సెట్లను సరిచూసుకున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి వాటిని ఇంటర్‌బోర్డు సూచనలకు అనుగుణంగా పరీక్షల తేదీలు, పేపర్ల వారీగా కవర్లలో ప్యాక్ చేసి, సీల్‌వేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఎంతో పకడ్బందీగా, ఒకటికి రెండు పర్యాయాలు చెక్‌చేసుకొని మరీ ఈ కవర్ ప్యాక్ చేయాల్సి ఉంటుంది. ఏ రోజు పరీక్ష ఉంటే, ఆ రోజుకు సంబంధించిన కవర్లను పోలీస్ బందోబస్తుతో పరీక్షా కేంద్రానికి తీసుకు వచ్చి అక్కడ సీసీ కెమెరా సమక్షంలోనే ఓపెన్ చేసి విద్యార్థులకు పంపిణీ చేస్తారు. అయితే ఈ కేంద్రంలో ఆరో రోజున అంటే 12వ..

- మిగతా 5వ పేజీలో...

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (ఆదివారం సాయంత్రం)

సహర్: 5:01 (సోమవారం ఉదయం)

పోలీస్‌శాఖకు సంపూర్ణ సహకారం

- గంజాయి నిర్మూలనలో కఠినంగా వ్యవహరించాలి
- మత సామరస్యంలో జిల్లా రోల్‌మోడల్‌గా నిలవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖ అంటేనే క్రమశిక్షణతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌కు మారుపేరన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రీడలు ఎంతో దోహదపడతాయని, క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలను పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఎంతో మంది యువత, విద్యార్థులు వారి బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారిని సక్రమ మార్గంలో పెట్టి జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ జాతీయ స్థాయిలో క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించే పోలీస్ క్రీడాకారులకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా వృద్ధులకు సైతం కలెక్టర్ గ్రీవెన్స్‌డే నిర్వహించి వారి ఇబ్బందులు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపద సమయంలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం అండగా ఉంటున్నామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయంలోని డార్మెటరీ హాల్ మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. తన నిధులు, ప్రభుత్వ సహకారంతో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డీఎస్పీ కార్యాలయం, ఇతర నూతన భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి పోలీస్‌శాఖకు ఏం కావాలన్నా తన వంతుగా కృషి చేస్తానన్నారు. అదే విధంగా నల్లగొండ జిల్లా అంటేనే మత సామరస్యానికి ప్రతీక అని, రానున్న రంజాన్, ఇతర పండుగల నేపథ్యంలో అంతా సోదరభావంతో మెలిగాలన్నారు. కలిసి మెలిసి పండగలను శాంతియుతగా నిర్వహించుకోవాలని సూచించారు.25 ఏళ్లుగా జిల్లా కేంద్రంలో ఎలాంటి మత ఘర్షణలు లేకుండా సోదరభావంతో మెలిగామని, రానున్న రోజుల్లో కూడా ఇలాగే ఉంటూ జిల్లా రోల్‌మోడల్‌గా నిలవాలన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యూనిఫాం సర్వీస్ కాబట్టి స్పోర్ట్స్ చాలా అవసరమన్నారు. మూడు రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉంటూ ఒత్తిడితో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇలాంటి స్పోర్ట్స్ మీట్ ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. ఈ ఆలోచనతో హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్ల తర్వాత స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు స్టేట్ పోలీస్ మీట్‌లో బంగారు పతకాలు సైతం సాధించారని, ఉమెన్స్ విభాగంలో సెకండ్ ప్లేస్‌లో నిలవడం సంతోషకరమన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్‌వార్ క్రీడాంశాల్లో ఏఆర్ నల్లగొండ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, నల్లగొండ సబ్ డివిజన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, రమేష్, ఆర్ఐలు శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనపై 'పెదవి విరుపే'..!

- చుట్టపు చూపుగా వస్తున్న ప్రత్యేకాధికారులు
- ప(మ)ని భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే



గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ప్రత్యేకత ఏమీ కన్పించడం లేదు. సొంత డ్యూటీ పని ఒత్తిళ్లతో పంచాయతీలకు ప్రత్యేకాధికారులు చుట్టపు చూపుగా వస్తున్నారే తప్ప పూర్తిస్థాయి పాలనపై దృష్టిపెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ప్రత్యేక పాలన పంచాయతీ కార్యదర్శులకైతే 'ఎంకి పెళ్లి సుబ్బి చావు' కొచ్చిన చందంగా మారింది. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం పూర్తవడంతో గత 13 నెలలుగా సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. పేరుకే ప్రత్యేకాధికారులు ఉన్నారు కానీ భారమంతా పంచాయతీ కార్యదర్శులదేనన్న అభిప్రాయం వినపడుతోంది. ప్రజలకు అవసరమైన తాగు నీటి బోర్ల ఏర్పాటు, మోటార్ల మరమ్మతు, పైపులైన్ల లీకేజీ రిపేర్లు, విద్యుత్ వీధిదీపాలు, మురుగు కాల్వ నిర్వహణ పనులలో పురోగతి లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు.

•5లో..

బకాయిలు చెల్లించకుంటే పరీక్షలు కొనసాగించలేం



వీసీకి వినతిపత్రం ఇస్తున్న కళాశాలల యజమానులు

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాల యాజమాన్యాలకు నాలుగేళ్లుగా చెల్లించాల్సిన ఆర్‌టీఎఫ్ బకాయిలు ఇవ్వకుంటే 1, 4, 6వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించేది లేదని డిగ్రీ అండ్ పీజీ కళాశాల యాజమాన్య సంఘాలు స్పష్టం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎంజీయూ వీసీ అల్తాఫ్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం ఏళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించడంలేదన్నారు. పేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ తాము అప్పులు చేసి కళాశాలలు నడుపుతూ ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. యాజమాన్యాలకు నాలుగేళ్లుగా ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ ఫీజులు చెల్లించకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. భవనాల అద్దె, ఉద్యోగాల వేతనాల ఒత్తిడి, వారి సహాయనిరాకరణ, రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు టి.శ్రీనివాసరెడ్డి, సిహెచ్.సత్యంగౌడ్, డాక్టర్ పి.నర్సింహారెడ్డి, యం.సైదారావు, కె.జైపాల్‌రెడ్డి, జానయ్యయాదవ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఈవీఎం గోదాం వద్ద అఖిలపక్ష నాయకులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు పంపిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని కలెక్టర్ శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లపై లబ్దిదారులకు, గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహ నిర్మాణశాఖ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంల వద్ద నిరంతరం భద్రత ఉండాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాం వద్ద నిరంతర భద్రత కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రతీ నెల ఈవీఎం గోదాం తనిఖీలో భాగంగా శనివారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును ఆమె తనిఖీ చేశారు. వారి సమక్షంలో గోదాం సీల్ తీయించి భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఫొటో ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయపార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 1,812 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్ చొప్పున నియమించాలన్నారు. దీంతో ఓటరు జాబితా తయారీలో ఎలాంటి తప్పులు దొర్లవన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫాం-6, 7, 8లను ఈనెల 21 లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పలు రాజకీయపార్టీల ప్రతినిధులు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థుల సామర్థ్యం పెంపు: డీఈవో

హాలియా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఏఎక్స్‌ఎల్ టెక్నాలజీ విద్యార్థుల సామర్థ్యం పెంపునకు దోహదపడుతుందని డీఈవో భిక్షపతి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీతో కూడిన కృత్రిమ మేధను ఉపయోగిస్తూ ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందు లో భాగంగా ఈనెల 12న సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. 3, 4, 5 తరగతుల్లోని సీ-గ్రేడ్ పిల్లలను గుర్తించి ప్రతీ విద్యార్థికి పీరియడ్‌కు 20 నిమిషాల చొప్పున భాషాంశాల్లో రెండు పిరియడ్లు, గణితంలో రెండు పీరియడ్లు కేటాయిస్తూ టైంటేబుల్ రూపొందించి తరగతులు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సహకరిస్తూ సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం పొందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, రవీందర్, జె.నిర్మల, సరిత, తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో



వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

దేవరకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర కులస్థులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ప్రభుత్వ రుణాలు మంజూరు చేసి ఆదు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరంజన్, శ్రీను, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా,మార్చి15(ఆంధ్రజ్యోతి): హజారీగూడెం సబ్‌స్టేషన్‌పరిధిలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు ఏఈ ధన్‌రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హజారీగూడెం, అలీనగర్, చల్మారెడ్డిగూడెం, కొట్టాల, వెంకటేనగర్‌లో అంతరాయం ఉంటుదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేద పండితులు

వేములపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు గ్రామంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి, ఆండాలు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అశ్వవాహనంపై అమ్మవారిని పల్లకిలో గ్రామ సేవకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే నీలా భిక్షమయ్య జ్ఞాపకార్థంగా ఆయన భార్య పాండారమ్మ, కుమారుడు నీలా సత్యనారాయణ సహ కారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అర్చకులు యజ్ఞికులు కొమండూరి తిరుమలచార్యులు, కాటూరి శ్రీధరాచార్యుల బృందం ఆధ్వర్యంలో సల్కునూరు భక్త బృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ఏఐ ఉపయోగం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో,

దామరచర్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులకు చదువులో ఆసక్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఉపయోగపడ తుందని ఎంఈవో ఎం.బాలాజీ నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగానాయక్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూ టర్ ల్యాబ్‌ను వారు ప్రార ంభించి మాట్లాడారు. సాంకేతిక ఉప కరణాల ద్వారా ప్రాథమిక స్థాయి లోనే విద్యార్థులను అభ్యాసనం వైపు ఆసక్తి పెంచడానికి ల్యాబ్‌లు ఉపయోగ పడు తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా డిజిటల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నందున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. అలాగే కల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారు మా ట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధీరావత్ పాచునాయక్, హెచ్‌ఎం శ్రీదేవి, నారా యణ, భారతి, కీర్తన పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యానికి సన్మానం



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను అఖిల భారత యాదవ సంఘం నాయకులు హైదరాబాద్ ముగ్దాం భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలు వాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, రాష్ట్ర కార్య దర్శి లోడంగి గోవర్ధన్ యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా గొర్రెల పెంపకం సొసైటీ మాజీ చైర్మన్ సోమనబోయిన సుధాకర్ యాదవ్, జిల్లా నాయకులు గుణ మోని వెంకటేశ్వర్లు యాదవ్, సురేష్ యాదవ్, లింగయ్య యాదవ్, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

మిర్యాలగూడ టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరాటేతో క్రమశిక్షణ అలవడుతుందని, ఆత్మరక్షణ కలుగుతుందని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్ అన్నారు. పాఠశాల మైదానంలో శనివారం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి సారించాలన్నారు. నిత్య సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం కటాస్, స్పారింగ్, నాన్ చాక్, స్టిక్ ఫిట్, బ్రేకింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించిన ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సుజయ్‌కుమార్, శివశంకర్, నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు

సెయింట్ జోసఫ్‌చర్చి వార్షికోత్సవం



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నాగార్జునసాగర్,మార్చి15(ఆంధ్రజ్యోతి): స్థానిక హిల్‌కాలనీలో ఉన్న సెయింట్ జోసఫ్ చర్చి 54వ వార్షికోత్సవాన్ని శనివారంనిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాధర్ గాలి జయరాజ్ హాజరయ్యారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు తండ్రి జోసఫ్ ఔనత్యాన్ని భక్తులకు తెలిపారు. కార్యక్రమంలో పాదర్ పచ్చిగోల్ల క్రీస్తురాజు, మధు, సిస్టర్ క్లారా, సిస్టర్ లలిత, ప్రియా, అంతయ్య, రాజు, అనంత్, అంటోని పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

చింతపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోటిగడ్డతండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను కోరారు. వేసవి కావడంతో తాగునీటి సరఫరా మూడు రోజులకోసారి నీరు సరఫరా అవుతుండడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే బాలునాయక్ స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఫోన్ చేసి తాగనీటి సమస్య పరిష్కారించి ప్రజలకు మౌలిక వసతి సౌకర్యాల కల్పన కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు. కలిసిన వారిలో మాజీ సర్పంచి ఇస్లావత్ పద్మ పుల్‌సింగ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

చింతపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. చింతపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన విలేరులతో మాట్లాడారు. అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డిని సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతుంటే ఎలాంటి కారణం లేకుండా సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

డోలాయమానంలో డిగ్రీ కళాశాలలు

● ప్రైవేటు డిగ్రీ కళాశాలలో 20 నెలలుగా అందని ఫీజు రీయింబర్స్ మెంట్ ● వేతనాలు, భవనాల అద్దెలు చెల్లించలేని దుస్థితిలో యాజమాన్యాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు నిర్వాహణ యాజమాన్యాలకు గుదిబండగా మారింది. కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి కళా శాలలకు రావాల్సిన బకాయిలు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం స్పందించి బకాయిలను వెంటనే మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి-హాలియా)



హాలియాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసన తెలుపుతున్న ప్రైవేటు యాజమాన్యాలు(ఫైల్)

ప్రైవేటు కళాశాలలకు దాదాపుగా 20 నెలలుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్‌టీఎఫ్ (రీయిం బర్స్ మెంట్ ట్యూషన్ ఫీజు) బకాయిలు రాక ప్రైవేటు డిగ్రీ కళాశాలలు డోలాయయానంలో కొట్టుమిట్టాడుతున్నా యి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఒక వైపు కళాశాలల అద్దెలు చెల్లించలేక, మరోవైపు అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది.. ఇంటర్ తర్వాత విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్ విభాగాలకు పోగా మిగిలిన వారు డిగ్రీ కళాశాలలో చేరుతుంటారు. గ్రామీణ ప్రాంతంలో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆర్‌టీఎఫ్ ఫీజుతోనే చదువు చెబుతామని విద్యార్థులను ఆకర్షిస్తూ యజమాన్యాలు విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా ఆర్‌టీఎఫ్ ఫీజు వస్తే విద్యాసంవత్సరం ఇబ్బంది లేకుండా కొనసాగుతుందనే భావనతో ఉన్న నిరుద్యోగ యాజమాన్యాలు ప్రభు త్వం నుంచి ఆర్‌టీఎఫ్ ఫీజు అందక అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారు. తాము బతకడం కోసం తమతో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ యాజమాన్యాలు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ విద్యా సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ప్రభుత్వం ఫీజులు చెల్లించక ఇబ్బందులకు గురవుతున్నామని రోజు వారి ఖర్చులకు కూడా ఎంతో కష్టపడాల్సి వస్తుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024 సంవత్సరం నుంచి ఆర్‌టీఎఫ్ ఫీజుల కోసం డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వంపై ఎన్నో రకాలుగా ఒత్తిడి తేస్తూ వినతి పత్రాలు సమర్పించినా ఫీజు బకాయిలు విడుదల కావడం లేదన్నారు. అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితిలో ఎంతో ఆందోళన, వేదనకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ఈనెల 20 వరకు ప్రభుత్వం ఆర్‌టీఎఫ్ ఫీజు విడుదల చేయకపోతే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించ లేమని 16 నెలల్లో ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని యాజమాన్యాలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టీఎఫ్ ఫీజులు వసూలు కాక పోవడంతో యాజమాన్యాలు కొంత మేరకు విద్యార్థులపై కూడా ఫీజుల కోసం ఒత్తిడి తేస్తున్న సందర్భాలు సైతం కొనసాగుతున్నా యి.

రూ. 60 లక్షల బకాయిలు రావాల్సి ఉంది



నా కళాశాలకు ఇప్పటి వరకు రూ. 60 లక్షల ఫీజు బకాయిలు రావాల్సి ఉంది. అద్దె చెల్లించలేని, వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా ఫీజు బకాయిలు విడుదల చేసి డిగ్రీ కళాశాలలను ఆదుకోవాలి.

-అప్పారెడ్డి, ప్రిన్సిపాల్, సృజన డిగ్రీ కళాశాల

ఇబ్బంది పడుతున్నాం



మాకు రావాల్సిన ఆర్‌టీఎఫ్ ఫీజు ఇంకా రాక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. మేము ఇబ్బంది పడుతున్నాం. రీయింబర్స్‌మెంట్ వెంటనే మంజూరు చేయాలి

- పగడాల అనూష, డిగ్రీ ఫైనల్ ఇయర్

ప్రభుత్వం చొరవ చూపాలి



హాలియాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నా. ఆర్‌టీఎఫ్ ఫీజుతో చదువు చెబుతామన్నారు. మూడేళ్లుగా నాపేరు మీద ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని యాజ మాన్యాలు చెబుతున్నాయి ఫీజు విడుదల చేసేం దుకు ప్రభుత్వం చొరవ చూపాలి. - పరమేష్ , డిగ్రీ ఫైనల్ ఇయర్



ముస్తాబైన శ్రీవారి ఆలయం

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చింతపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల(వీ.టీ.నగర్) కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి ఆదివారం నుంచి ఈ నెల 22వ వరకు ఆలయ కమిటీ, ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామలింగేశ్వర ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను కొండపైకి ప్రవేశం, విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, రుత్వీ కరణం, రక్షాబంధన, అఖండ దీపారాధన, కలశస్థాపన హోమం. 17న మండపరాధన, ధ్వజరోహణం, గరుడముద్ద ప్రసాదం, అగ్ని ప్రతిష్ఠ, హోమం సాయంత్రం 7 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం, 18న తిరు మం జనం, బలిహోరణం, మన్యుసూక్త హోమం, ప్రసాదం, 19న శ్రీవారి రథోత్సవం, 20న లక్ష్మి హాయగ్రీవ ఇష్ట హోమం, సాయంత్రం తులా భారం. 21న ఆలయ ప్రాంగణంలో రుద్ర సహిత హోమం, సాయంత్రం 7 గంటలకు రుక్మిణీ సత్యభామ సహిత వేణు గోపాల స్వామి కల్యాణం. 22 ఉత్సవ విగ్రహాలను ఊరేగింపును నిర్వహించ ను న్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్ కోరారు.

ఆస్తిపన్ను వందశాతం వసూలు చేయాలి



దేవరకొండ : అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, నీటి కుళాయిల బిల్లులు, వాణిజ్య లైసెన్స్‌ల ఫీజులు వందశాతం వసూళ్లు చేయాలని మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం అధికారులతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటిని వృథా చేయకుండా ఆన్, ఆఫ్ బిగించాలని ఆదేశించారు. శివారు కాలనీలకు నీరందేలా చర్యలు చేపట్టా లన్నారు. దుకాణాల ముందు చెత్త వేయకుండా చూసుకోవాలని వ్యాపారులకు సూచించాలని అన్నారు. సమావేశంలో ఏఈ రాజు, రెవెన్యూ అధికారి ఆరీఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శం కర్, అడ్మినిస్ట్రేషన్ అధికారి రాకేష్, వార్డు అధికారులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు

మిర్యాలగూడ టౌన్ : మునిసిపల్ పరిధిలో పన్ను వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినటు కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ మొండి బకాయిదారులను గుర్తించి రెడ్ నోటీసులం దజేశామన్నారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిలయన్స్ పెట్రోల్ బంక్ యాజమాన్యం రూ. 1.42 లక్షల పన్ను చెల్లించకపోవడంతో బంక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టణ నడిబొడ్డులోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ బకాయిలు రూ. 13 లక్షలకు పైనే ఉన్నాయన్నారు. కాంప్లెక్స్‌లోని దుకాణాలను నెలనెల అద్దె చెల్లించేవారు సంవత్సరానికి ఒకసారి ఆస్తి పన్ను చెల్లించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహి స్తున్నారో అ ర్థం కావడం లేదన్నారు. అలాగే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరి శీలన, క్రమబద్ధీకరణ సులభ తరమైందని, దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకుని ఫీజులో 25శాతం రాయితీ పొందా లన్నారు. ఆయన వెంట అధికారులు జ్ఞానేశ్వరి, వెంకటరమణ తదితరులున్నారు.

ఆస్తి పన్నులను చెల్లించాలి

హాలియా : హాలియా మునిసిపాలిటీలోని గృహ యజ మానులంతా 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున గృహ యజమా నులందరూ ఇంటి పన్నులను చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన జాజం వెంకటేశ్వర్లు ఇంటిపన్ను బకాయి రెండే ళ్లుగా బకాయి రూ. 84,750 ఉన్నందున 15 రోజుల క్రితం రెడ్ నోటీసును జారీ చేశారు. అయినా పన్ను చెల్లించకపోవడతో ఇంటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్నులను చెల్లించని యెడల ఆస్తిని జప్తు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పెసల వేలంలో సిండికేటు ?

డిండి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో వ్యవసాయశాఖ ఇటీవ ల నిర్వ హించిన పెసల వేలంలో ట్రేడర్లు సిండికేటైనట్లు తెలుస్తోంది. 2023 మార్చిలో డిండి విత్త నోత్పత్తి క్షేత్రంలో పండించిన పెసలును కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈనెల 13న 45 క్వింటాళ్ల పెసలును వేలం వేయగా సూర్యపేటకు చెందిన ఓ ట్రేడర్ క్వింటాల్ పెసలు రూ.4,050 అత్యధికంగా పాడి మొ త్తం సరుకును దక్కించుకున్నాడు. బయట మార్కెట్‌లో పెసల ధర క్వింటాల్ రూ. 10వేలు పలుకుతుండగా ట్రేడర్ తక్కువ ధరకు రూ.4,050 క్వింటాల్‌కు పాడి దక్కిం చుకోవడం అనుమానాలకు తావిస్తుంది. వేలంలో పాల్గొన్న ఐదుగురు ట్రేడర్లు సిండి కేటైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై డిండి విత్తనోత్పత్తి ఏడీ నివేదితను వివరణ కోరగా పెసలు వేలం వేసి జిల్లా వ్యవ సాయశాఖ అధికారికి నివేదించామని తెలి పారు. ట్రేడర్‌కు అప్పగించేందుకు జిల్లా అధి కారి నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

అడవిదేవులపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, చేతి బోర్లకు మరమ్మతులు చేయాలని, లీకేజీలు ఉన్నచోట పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణ, నర్సరీల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్, ఏపీవో సూర్యా నాయక్, కార్యాలయ సిబ్బంది అమీర్‌అలీ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన థర్మల్ పవర్ ప్లాంట్ బాధితులు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన బాధితులు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన కపురతండా, మోదు గుల కుంట ఆర్ అండ్‌ఆర్ బాధితులు శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను హైదరాబాద్ ప్రజాభవన్‌లో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ బాధితుల సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.అలాగే వైటీపీసీఎస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సుల్తానియాను కలిసి సమస్యలు విన్నవించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఉద్యోగ నియామకాల తేదీని ఖరారు చేసి ప్రతి ఒక్క బాధితుడికి ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయ సంఘం ఎన్నిక నిర్వహించడం సరికాదు

చింతపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ.టీ.నగర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్నిక ఎంఈవో నిర్వహించడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సిలివేరు సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ నియ మాలను పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. మర్రిగూడ, చింతపల్లి విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎం.ఆనంద్‌బాబు, ఎన్. శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణయ్య. తదితరులు పాల్గొన్నారు.

గురిపెట్టారు.. కొలువుకొట్టారు

● గ్రూప్స్ ఫలితాల్లో తిరుమలగిరి (సాగర్) మండల వాసుల ప్రతిభ



ప్రణీత్

తిరుమలగిరి(సాగర్), మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా అకుంఠిత దీక్ష, పట్టుదలతో తాము కలలుగన్న గమ్యాన్ని చేరారు మండలానికి చేరిన ఇద్దరు యువకులు. తిరు మలగిరి (సాగర్) మండల కేంద్రానికి చెందిన కొత్తూరు లక్ష్మయ్య రోజారాణి కుమారుడు ప్రణీత్ గ్రూప్-1 పరీ క్షలో రాష్ట్రస్థాయిలో 500 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండానే సొంతంగా ప్రిపేర్ అవుతూ ఉన్నత ఉద్యోగానికి సాధించాడు. 2020 నుంచి 2024వరకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. తన తండ్రి ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడు కావడం చేత ప్రాథమిక, హైస్కూల్ విద్యాభ్యాసాన్ని వనపర్తి, కామారెడ్డి, జహీరాబాద్ వంటి ప్రాంతాల్లో పూర్తి చేశాడు. ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాల, బీటెక్ విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో 2016లో పూర్తి చేశాడు. 2021 వరకు ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని నిర్వర్తించాడు. సామాన్య ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందనే ఉన్నత ఆశయంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి 2021 నుంచి నేటి వరకు సివిల్స్, టీజీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. నాలుగుసార్లు సివిల్స్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అవుతూనే మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతూ 2024లో టీజీపీఎస్సీ గ్రూప్-1, 2, 3, 4పరీక్షలను రాశాడు. ఈ క్రమంలో గ్రూప్-4లో ఉద్యోగాన్ని సాధించి ప్రస్తుతం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల వెలువడిన గ్రూప్- 1 ఫలితాల్లో 500 మార్కులు సాధించగా గ్రూప్-2లో 448వ ర్యాంకు గ్రూప్- 3లో రాష్ట్రస్థాయిలో 400 మార్కులు సాధించాడు. ప్రణీత్ తండ్రి ప్రస్తుతం దామర్లచర్ల లోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. గతంలో ఇన్‌చార్జి రీజినల్ కోఆర్డినేటర్‌గా మూడేళ్లు పని చేశాడు.

నేతాపురం వాసికి గ్రూప్-3లో 33వ ర్యాంక్



పరాక్రమరెడ్డి

మండలంలోని నేతాపురం గ్రామానికి చెందిన కత్తి వీర పరాక్రమరెడ్డి గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 33వ ర్యాంకు సాధించాడు. నల్లగొండలోని శ్రీరామ నందతీర్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి అప్పటి నుంచి పోటీ పరీ క్షలకు సన్నద్ధమయ్యాడు. ఈ క్రమంలో 2013లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, 2014లో దేనా బ్యాంక్, అదే ఏడాది కెనరా బ్యాంక్‌లో ఉద్యోగం సాధించి ప్రస్తుతం అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగం చేస్తూనే సివిల్స్ గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల వెలువడిన టీజీపీఎస్సీ గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 379వ ర్యాంకు, గ్రూప్-3 రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంకు సాధిం చాడు. అంతిమంగా గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యంగా తాను నిర్విరామంగా కృషి చేస్తానని ఆత్మవిశ్వాసంతో వీరపరాక్రమరెడ్డి తెలిపారు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

పొంచి ఉన్న ప్రమాదం



విద్యుత్ స్తంభం కారణంగా పగిలిన తాగునీటి పైపులైన్

మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ 30వ వార్డులో ఇటీవల వేసిన విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాన్ని కాలనీకి వచ్చే తాగునీటి పైపులైన్‌కు ఆనుకొని ఏర్పాటుచేయడంతో తాగునీటి పైపులైన్ పగిలి మడుగుగా ఏర్పడి రోడ్డు వెంట కాల్వలా పారుతోంది. దీంతో స్తంభం ఒరిగి కిందపడితే విద్యుత్ వైర్లు తెగి వాహనదారులపై, ఆడుకునే చిన్నారులపై పడే ప్రమాదం లేకపోలేదని కాలనీ వాసులు ఆందో ళన చెందుతున్నారు. ఈ స్థలంలో స్తంభం ఏర్పాటు చేయవద్దని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా ఏర్పాటు చేయడంతో తాము ఇబ్బందులు పడు తున్నామని పలువురు పేర్కొంటున్నారు. తాగునీటి పైపులైన్ పగిలి నాలుగు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని అక్కడి నుంచి తొలగించి మున్సిపల్ అధికారులు తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడరూరల్)